
జనేవరి, 1939.

విడిసంచిక ౨ అణాలు.

ఆంధ్రభూమి



ఆంధ్రభూమి ముద్రణాలయము—వేపేరి, మదరాసు.





Consulting Physician :—

ఆయుర్వేదభూషణ

వేటూరి శంకరశాస్త్రిగారు, ఎ.ఎం.ఎ.సి.

ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.
సంపాదకుడు :
ఆండ్ర, శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౭. బహుధాన్య, పుష్యము : జనవరి, 1939. సంచిక : ౬.

సంపాదకీయ సమాలోచన

గంజిపోయుచున్నను ఉట్టివంక చూచుట :—

మదరాసులో స్వదేశీవస్తుప్రదర్శనము మహనీయముగ సాగుచున్నది—తమిళనాడు కాంగ్రెస్ సంఘమువారి యాజమాన్యమున. ఇందులోకూడ ఆంధ్ర, అరవ విభేదము వియత్తలమును చిదళించగల యంతవిశేషముగ కానవచ్చుచున్నది. ప్రముఖస్థానములన్నియు అరవల ఆక్రమణలో పడినవి. మూరు మూలస్థానములన్నియు ఆంధ్రులకు వదలబడినవి. ఇంతమాత్రమేకాదు. ప్రపంచప్రఖ్యాతిగాంచిన ఆంధ్రుల ఆయుర్వేదాశ్రమము మున్నగు సంస్థలకు అచ్చట ప్రాతినిధ్యమే లేకపోయినది. ప్రదర్శన నిర్మాతలకు ఇంతటి పాక్షికబుద్ధి, ఆంధ్రద్వేషము ఏలకలిగినది? ప్రదర్శనమును చూడబోవు ప్రేక్షకసమూహములో తెనుగు మొగములే తఱుచు కనుపించుచున్నవి. ఆంధ్రద్వేషమును ప్రబలముగా ప్రదర్శించు ఈ స్వదేశీ వస్తుప్రదర్శనమును ఆంధ్రులు విఱగబడి చూచుచుండుటను ఏమనవలయును? స్వాభిమానము ఆంధ్రుల ఇంట మందునకైన గానరాకుండపోయినదేమి?

ఆ గంజాయివనములో ఈ తులసి మొక్కలు ఎందుకు? :—

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షుడు బహిష్కరింపతగినది అనినాడు. తమిళనాడు కాంగ్రెస్ సంఘాధ్యక్షుడు నిషేధింపతగినది అనినాడు. కాంగ్రెస్ కార్యకారిణీ సంఘసభ్యురాలు కూడనిపని అని కూకలుపెట్టినది. సాంఘిక వాదప్రముఖురాలు కమలాదేవికూడ కానిపని అని కక్కసించుకొన్నది. ఇంకను పలువురు ప్రముఖులు తీవ్రముగా నిరసించినారు. అయినను వార్కిపండితుడు నిశ్చితార్థమును విడుచునట్లు లేదు. మదరాసు త్రిశతాబ్దిమహోత్సవమును జరిపితీరుటకే కృతనిశ్చయుడు అయినాడు. కమిటీలు ఏర్పడినవి. ఆకమిటీలలో సభ్యులందరును అరవవారే. కొసరుగామాత్రము ఇద్దఱు ఆంధ్రులను—శ్రీనేలటూరి వేంకటరమణయ్య, శ్రీమామిడిపూడి వేంకటరంగయ్య—చేర్చినారు. అసలు ఆమహోత్సవము దాస్యచిహ్నము. స్వాతంత్ర్యప్రియులగు ఆంధ్రులు అందు దిగబడకూడదు. పైగా ఆమహోత్సవ సందర్భమున అరవల ప్రాబల్యము అధికతరమై ఉన్నది. అట్టిచో ఇద్దరు ఆంధ్రులుండి అంధ్ర ఆంధ్రత్వమును ఏమాత్రము నిలబెట్టగలరు? వ్రతము చెడినను ఫలముదక్కదు. కావున ఆగంజాయివనములోనుంచి ఈరెండు తులసి మొక్కలును వెంటనే లేచిరావలయును.

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి యోగ్యత :—

నెల్లూరు మునిసిపల్ అధ్యక్షుని ఎన్నికలో కాంగ్రెస్ మాటకు చెల్లుబడిలేకపోయినది. కాంగ్రెస్ సిఫారసుచేసినవ్యక్తి ఎన్నికలో ఓడిపోయినాడు. ఇది ఇటులుండ ఇటీవల రెండు నెల్లూరుజిల్లాబోర్డులు ఏకమగుటయు తిరిగి అధ్యక్షవరణము జరుగవలసివచ్చుటయు సంఘటించినది. నెల్లూరు మునిసిపాలిటీవలెనే నెల్లూరు జిల్లాబోర్డులోకూడ కాంగ్రెస్ దెబ్బతినునేమో అను భయము పొడసూపినది. ఈ అధ్యక్షస్థానమునకు శ్రీవంగోల్లు కోదండరామిరెడ్డికి శ్రీదేవరపల్లి వెంకటకృష్ణారెడ్డికి—ఈ ఇరువురికిమాత్రమే అవకాశము ఉండుట వెల్లడిఅయినది. రాష్ట్రకాంగ్రెస్ సంఘమువారు శ్రీవంగోల్లు కోదండరామిరెడ్డిని సిఫారసుచేసినారు. అందుమీద శ్రీదేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి మారుమాటాడక రాష్ట్ర కాంగ్రెస్‌సంఘమువారి సిఫారసును తులసీదళమువలె తలదాల్చి రామిరెడ్డి విజయమునకు తోడుపడినాడు. మునిసిపల్ అధ్యక్షుని ఎన్నికలో నెల్లూరుకు కలిగిన అపకీర్తి ఈజిల్లాబోర్డు అధ్యక్షుని ఎన్నికతో పోయినదని చెప్పవచ్చును. ఆదర్శప్రాయమైన ఇట్టిశిక్షణను ప్రదర్శించినందుకు నెల్లూరుమండల పత్రికఅయిన జమీన్‌రైతు శ్రీదేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిని అభినందించియున్నది. దీప్యమానమైన శ్రీదేవరపల్లి వారి ఆదర్శజ్యోతి అధికారములను వాంఛించు కాంగ్రెస్ సభ్యులకు చిత్తసంస్కారమును కలిగించుచుండునుగాక!

మదరాసు పోర్టులో తెలుగు అవసరము లేదా?

మదరాసు పోర్టు ఆఫీసులో ఈనడుమ ఒక ఓవర్‌సీర్ ఉద్యోగము ఖాలీపచ్చినది. ఆఖాలీని భర్తీ చేయుటకు అభ్యర్థులులను ఆహ్వానించుచు మద్రాసు ఆంగ్ల దినపత్రికలలో ప్రకటనలు పడినవి. ఆ ప్రకటనలో ఆఓవర్‌సీర్‌కు ఆంగ్లము, అరవము మాత్రము రావలయునని ఉన్నది. దీనినిపట్టి రేవు వ్యవహారములలో ఆంధ్రమునకు స్థానములేదనియే గదా తేలుచున్నది. మద్రాసు వర్తకులలో విదేశవ్యాపారము సాగించువారిలో పలువురు ఆంధ్రులే అయినను విదేశములనుంచి సరకు దిగుమతిచేయు రేవులో ఆంధ్రుల భాషకు ఆస్కారములేదు. ఆంధ్రభాషాభిమానములేక మదరాసు ఆంధ్రవర్తకులు వర్తకముకొఱకు అన్యభాషను ఆశ్రయించుటచేతనే మదరాసు రేవుకు ఆంధ్రవర్తకులతో అక్కరయుండియు వారిభాషతో అక్కఱలేక పోయినది. మదరాసులో కోర్టుభాష అరవము. కోస్తావ్యాపారపుభాష అరవము. ఇక ఆంధ్రమునకు నిలువనీడ ఎక్కడ? ప్రస్తుతములో మనము తెనుగును కోర్టుభాషగా చేయజాలము. కాని దీక్ష వహించుచో తెనుగును కోస్తావ్యాపారపుభాషగ చేయగలము. మన వర్తకులు కొంచెము శ్రద్ధవహించవలెను. మద్రాసు వర్తకములో ఆంధ్రవర్తకుల పలుకుబడికి తగిన పలుకుబడి ఆంధ్రమునకుకూడ అప్పుడు కలుగగలదు. మదరాసు ఆంధ్రవర్తకులు మాతృభాషకొఱకు ఆమాత్రము శ్రద్ధపూనలేరా?

ఆంధ్రులు ఒక ఆంగ్ల వారపత్రికనైన పోషింపలేకపోయినారు :—

ఆంగ్లదినపత్రిక లేక ఆంధ్రుల అగచాట్లు అఖిలభారత నాయకులకు అందుటలేదను విషయము అందరను అంగీకరించినదే. అరవలు ఆంగ్లమున దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు నడుపుకొని అఖిలభారత రంగమున అతిశయ ప్రాబల్యమును సంపాదించుకొని ప్రకాశించుచున్నారు. ఆంధ్రులకు ఒక్క ఆంగ్ల దినపత్రిక అయినలేదు. ఇంతవరకు ఒక్క ఆంగ్లవారపత్రికయు, ఒక్క మాసపత్రికయు మాత్రము ఆంధ్రులకుండినవి. వారపత్రిక 'ఫెడరేటెడ్ ఇండియా'—మాసపత్రిక 'త్రివేణి'. ఈ రెండిటిని అయినను ఆంధ్రులు సమముగ సమాదరించుట లేదనవలయును. ఫెడరేటెడ్ ఇండియాను శ్రీవావిళ్ళ వెంకటేశ్వర

శాస్త్రియు—త్రివేణిని శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావును విశేష నష్టమునకు పాలుపడి నిర్వహించుచున్నారు. ఎంతకాలమని వ్యక్తులిట్లు నష్టమునకు పాలుబడుచు పత్రికలు నిర్వహింపగలరు ? నిర్వహింపలేరు కావుననే ఇపుడు శ్రీవావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి ఫెడరేటెడ్ ఇండియాను వారపత్రికగ నిర్వహించుట మాని మాసపత్రికగ మార్చినారు. ఈవిషయమును పురస్కరించుకొని నిన్నగాక మొన్న మదరాసులో అర్ధణా ఆంగ్లవారపత్రికగా పుట్టువుగన్న మోడరన్ టైమ్సు 'ఫెడరేటెడ్ ఇండియా వారపత్రిక చనిపోయినది. మాసపత్రికగా మరలపుట్టినది. ఉగాదిపత్రికగా మారకుండునుగాక !' అని ఉపాలంభించుచు వ్రాసినది. ఆంధ్రులపత్రికలన్న ఇతరులకు ఇంత చులకనగా ఉన్నది. ఒకవారపత్రికను అయినను ఒద్దికగా పోషించుకొనజాలనిజాతి సాటిజాతులలో ఎట్లు తలయెత్తుకొని తిరగగలదు? పత్రికలవిషయములో ఆంధ్రులు పాతకులు ఈపాతకదోషమే వారికి వారిసంఖ్యకు తగినసంపదను, వారితెలివికి తగినదీప్తిని, వారిఉత్సాహమునకు తగిన ఉత్పథమును లేకుండచేయుచున్నది. ఇప్పుడుకాని మఱిఎప్పుడుకాని ఈప్సితార్థమును బడయదలచినచో ఆంధ్రులు అరవలవలె, మహారాష్ట్రులవలె, వంగీయులవలె మాతృభాషాపత్రికలకుతోడు తమయాజమాన్యమున వెలువడు ఆంగ్లభాషాపత్రికలనుకూడ అధికతరముగ పోషించుకొనవలయును. ఈవిషయమును వారు ఎంతత్వరలో గ్రహించిన ఆంధ్రాభ్యుదయము అంతత్వరలో అభ్రంకషమగును.

కీ. శే. వేకుమళ్ళ రాజగోపాలలావుగారు :—

క్రిస్టియన్ కళాశాలలో దేశభాషాధ్యాపకాధికారిగా ఉండి ఇటీవలనే విశ్రాంతిగొన్న శ్రీయుత వేకుమళ్ళ రాజగోపాలరావుగారు దివంగతులయినారని వినుటకు చాలవిచారించుచున్నాము. శ్రీవారు గొప్ప పరిశోధకులు. వారు ఉద్యోగములో ఉండగా కొన్నినవలలు, వాచకపుస్తకములుమాత్రము ప్రచురించిరి. వారి పరిశోధక పుస్తకములు పెక్కులు ప్రచురణకు వేచియున్నవి. విశ్రాంతిగొనినారు కావున వానిని తాపీగా ప్రచురింప వారు తలంపుగొనిరి. ఆతలంపులోనే వారు ఒకస్వంత ముద్రణాలయమునుగూడ నెలకొల్పిరి. ఆముద్రణాలయమున స్వంతపత్రికఅగు ఆర్ష పత్రిక ఒకటి, రెండు సంచికలను మాత్రము ప్రచురించిరి. ఇంతలో వారికి మృత్యువు తోసుకువచ్చినది. వారి పరిశోధక గ్రంథములన్నియు అట్లేయున్నవి. వారి పుత్రులు విద్యావంతులు. వారు వానిని సద్వినియోగమునకు తేగలరనియే నమ్ముచున్నాము. ప్రస్తుతము శ్రీవారిపేర ఒకస్మారక సంపుటమును ప్రచురింప ప్రయత్నములు సాగుచున్నవి. ఆసంపుటము యొక్క విశేష విజయమునకు ఆంధ్రులెల్లరు విరివిగా తోడుపడుదురుగాక అని కోరుచున్నాము.

ఆంధ్రదేశమున తుపాను నష్టము : ప్రభుత్వదృష్టి :—

ఆంధ్రదేశమున మాగాణి పంటపండు ప్రదేశమంతయు ఈయేడు తుపాను తుడిచి తూటాడినది. పంటముఖమైయున్న చేలు పచ్చుమపాడు అయినవి. చేతికి అందిన సిద్ధాన్నకబళము చిందిపోయినది. కాని ప్రభుత్వము దీనిని యథాస్థితిలో అవలోకించినట్లులేదు. మొదట పశ్చిమగోదావరి మండలము కలక్టరు నష్టము అంత విశేషమైనదికాదనినాడు. రివిన్యూమంత్రి ఆప్రాంతములలో సంచారముచేసిన తరువాత నష్టము అపారమైనదే అని అతడు అంగీకరించినాడు. కాని దరిమిలాను రివిన్యూబోర్డుమెంబరులు ఆప్రాంతములనుచూచి నష్టమంత అపారముకాదనినారు. ప్రధానమంత్రి ఒకసారిపోయి చూచివచ్చిన బాగుండును. కాని వారు ఎక్కడవెళ్ళుదురు? ఆంధ్రదేశమును చూచివచ్చుటకు వారికి అనారోగ్యము అడ్డువచ్చినది. తమిళనాడు రాజకీయమహాసభను రాజపాళెము వెళ్ళుటకు వారికి అనారోగ్యము అడ్డురాలేదు.

దక్షిణముగా చూచినంతసేపు వారికి ఎట్టి ఆరోగ్యభంగభయమును ఉండదు. వారు స్వయముగా ఆంధ్రదేశము వెళ్ళకపోయినను వారునమ్మిన ఆంధ్రబంటు శ్రీఅయ్యదేవర కాళేశ్వరరావు పంతులిని చూచిరమ్మని పంపినారు. కాళేశ్వరరావుపంతులు చూచినంతమేర నష్టము అపారమైనదే అనిఅంగీకరించినారు. కాళేశ్వరరావుపంతులుమాటను రాజాజీ ఎంతవరకు విశ్వసించునో రేపు ఆప్రాంతములందు రెమిషన్ ఇచ్చు సందర్భమున తేలగలదు. కాళేశ్వరరావుపంతులుమాటకు ఆయన గురుదేవుడు రాజాజీ ఎంతవిలువకట్టునో తెలిసికొనుటకు ఈరెమిషన్‌లవిషయ మొకదీటురాయి కాగలదు.

శ్రీ నాగేశ్వర స్మారక సప్తాహ మహోత్సవము :—

1938 డిశంబరు 25-వ తేదీనుంచి నేటివరకు ఆంధ్రదేశమునందు అన్నితావులయందును శ్రీనాగేశ్వర స్మారకసప్తాహము జయప్రదముగను, ఉత్సాహపూరితముగను జరిగినది అని వినుటకు ఎంతయు ఆనందముగనున్నది. కొండంతదేవరను కొండంత పత్తిరితో పూజింపలేము. కాని చేసినంతవరకు, జరిగినంతవరకు నాగేశ్వరపూజ విశేషముగను, విశిష్టముగను జరిగినది. కాని ఈ మహోత్సవ సందర్భమున ప్రజలకు తగినంత కాలావకాశము లేకపోయినది అని మాత్రము విస్పష్టమైనది. కావున నాగేశ్వరనిధి సమీకరణము ఈ సప్తాహముతో సమాప్తము కాకూడదు. నాగేశ్వరుని సంవత్సర విమోకము అగువఱకును నిధి సమీకరణము సాగుచుండవలసినదే. సప్తాహ సందర్భమున ఆయా తావులయందు ఏర్పడిన కమిటీలే ఈనిధి సమీకరణ కార్యమును కూడ నిర్వహింపనగును. పెద్దనిధిని పోగుచేయుటకు అవకాశముకూడ పెద్దదిగా నుండవలయునుగదా ! శ్రీనాగేశ్వ స్మారక సప్తాహ మహోత్సవ నిర్మాత లీ విషయమును గుర్తింతురుగాక !

సంక్రాంతి

వచ్చింది సంక్రాంతి
వచ్చిందిరా !
వచ్చింది సంక్రాంతి
వచ్చిందిరా !
ముద్దులొల్కు ముగ్గు
ముచ్చటైనా పట్టు
పెట్టింది సంక్రాంతి
పెట్టిందిరా !
పెట్టింది సంక్రాంతి
పెట్టిందిరా !
గొబ్బెళ్ళ దేముళ్ళ
గోడబొమ్మలచే
ఒప్పింది సంక్రాంతి
ఒప్పిందిరా !
ఒప్పింది సంక్రాంతి
ఒప్పిందిరా !
అల్లుణ్ణికోడల్ని
అత్తిల్లు పుట్టిల్లు
చేర్చింది సంక్రాంతి
చేర్చిందిరా !
చేర్చింది సంక్రాంతి
చేర్చిందిరా !
కూడుగుడ్డా లేక
కుమిలేటిజై లీల
విడచింది సంక్రాంతి
విడచిందిరా !
విడచింది సంక్రాంతి
విడచిందిరా !
చిత్తంబురంజిల్ల
చిత్తజునిచితులచే
వెల్గింది సంక్రాంతి
వెల్గిందిరా !
వెల్గింది సంక్రాంతి
వెల్గిందిరా !
చిన్నచిన్నాప్రభల
చెన్నొప్ప తీర్థాని
కెళ్ళింది సంక్రాంతి
వెళ్ళిందిరా !
వెళ్ళింది సంక్రాంతి
వెళ్ళిందిరా !
సంక్రాంతి పురుషుణ్ణి
చంకబెట్టూకోని
వచ్చింది సంక్రాంతి
వచ్చిందిరా !
వచ్చింది సంక్రాంతి
వచ్చిందిరా !

—బులుసు సూర్యప్రకాశశాస్త్రి

కారపు శనగలు

సరోజనీదేవి నాలుగవ మద్రాసు మండల రాజకీయసమావేశంలో కాంగ్రెస్ భక్తులకు ఒక ఉపదేశంచేసింది :

కాంగ్రెస్ మంత్రులతో ఏవిషయంలోనేనా కాట్లాడవలసివస్తే అతిరహస్యంగా మాత్రం వారిని సపోర్టుచెయ్యమన్నది.

సరే. అల్లాగే చేస్తారనుకుందాం. రహస్యంగా కాట్లాడినా అధికారంలోవున్న కాంగ్రెస్ మంత్రులు అట్లా కాట్లాడిన వారిమీద డిసిప్లినరీచర్య పుచ్చుకొనే విషయంలో సరోజనీదేవి పూటకాపుగావుంటుందా ?

గాంధి సత్యము, అహింస కావాలంటాడు. లోపల కాట్లాడుకుంటూ పైకి సపోర్టు చేస్తూవుంటే అది సత్యదేవతారాధన అవుతుందా ?

* * *

త్రిపురికాంగ్రెస్ విశేషాలు అప్పుడే కొద్దికొద్దిగా తెలియవస్తూవున్నాయి.

త్రిపురి కాంగ్రెస్‌లో ఎలక్ట్రిక్ దీపాలు వుండవు. ఊరేగింపుకు ఏభైరెండు ఏనుగులు మాత్రం వస్తాయి.

హిందూదేశచరిత్రలో ఏనుగులు ఎప్పుడు కలగచేసుకున్నా కథ విషాదాంతమే అయివుంది.

అలగ్జాండరుతో పురుషోత్తముడు యుద్ధంచేసి ఓడిపోవడానికి కారణం పురుషోత్తముని ఏనుగులే--

తల్లికోటయుద్ధంలో రామరాజు ఓడిపోడానికి కారణం ఏనుగు అతనిపల్లకీమీదికి రావడమే.

హిందూదేశపు చరిత్రనుండి ఇట్టి నిదర్శనాలు ఎన్నో చూపవచ్చు.

ఏనుగులసంపర్కం వచ్చింది కాబట్టి త్రిపురిలో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని చారిత్రక సాంప్రదాయం సూచిస్తూవుంది. ఈఏనుగుల కాంగ్రెస్ ఓడిపోయి ఫెడరేషన్‌సంధికి అంగీకరించి తీరుతుంది.

ఇంతకీ ఎలక్ట్రిక్ దీపాలువుండవు కాబట్టి త్రిపురి కాంగ్రెస్ ఏమంత ప్రకాశమానంగా కూడా వుండదు.

ఏనుగులకళ్లు అసలే చిన్నవి అయి వుంటాయంటారు. ఎలక్ట్రిక్‌దీపాలు లేకపోతే తగిన వెలుగు లేక ఆచిన్న చిలిపికళ్ళ ఏనుగులు ఏమిచేస్తాయో చెప్పలేం.

ఇంతకీ కాంగ్రెస్ జరిగే ప్రదేశం మహాకోశలంకదా !

* * *

మన ఆరోగ్యశాఖామాత్యులు తెచ్చిన పబ్లిక్ హెల్తు బిల్లును గురించి మాట్లాడుతూ మద్రాసు ఎజంబ్లీలో మహమ్మదు స్కామ్నాడ్ మద్రాసు ఆరోగ్యశాఖామాత్యుడు మంచి ఆరోగ్యంతో చాలారోజులు జీవించి ఈబిల్లుయొక్క ప్రయోజనాన్ని గుర్తిస్తారని ఆశించాడు.

అజంబ్లీ అధ్యక్షులు అప్పుడు చమత్కరిస్తూ పబ్లిక్ హెల్తు బిల్లు ఆమోదింపబడి చట్టమైనతరువాత ఆరోగ్యశాఖామాత్యులకు దివ్యమైన ఆరోగ్యం, దీర్ఘమైన ఆరోగ్యం కలగవచ్చునన్నారు.

పబ్లిక్ హెల్తు బిల్లు దాని జనకుడికి ఇంతటి మంచి ఆశీర్వచనాలను సంపాదించి పెట్టిందన్నమాట.

* * *

ఆంధ్ర కాంగ్రెస్ ఎం. ఎల్. ఏ లకు అప్పుడప్పుడు గొప్పగొప్ప జిజ్ఞాసలు కలుగుతూ వుంటాయి. ఆ జిజ్ఞాసలు కలగడంతోటే వారు మీమాంసలకోసం ప్రయత్నం చేస్తుంటారు.

చూడండి మొన్నటి మద్రాసు శాసనసభా సమావేశంలో కళా వెంకటరావుగారికి 'పెరియార్' అంటే ఏమిటనే జిజ్ఞాసకలిగింది. నెలకు డెబ్బయిఐదు రూపాయిలజీతంపుచ్చుకుంటూ శాసనసభలో పెరియార్ శబ్దానికేనా అర్థం తేల్చకపోతే బొత్తిగా ఏమీపని చేయనట్లు కనిపిస్తుందని వారు పెరియార్ శబ్దానికి అర్థం ఏమిటని సభాసదుల్ని అర్థించారు.

కాని ఈ జిజ్ఞాసాపరుని ప్రశ్న ఎవరూ వినిపించుకోలేదు.

పన్నీరు సెల్వంగారు మాత్రం పెరియూర్ అంటే మీరు గాంధీకి ఉపయోగించే మహాత్మాశబ్దంలాంటిదని చెప్పారు.

కళావారి జిజ్ఞాసకు మీమాంస తేలింది.

ఈ యేడువారు శాసనసభలో చేసిన పనిని అంతా వివరంగా గ్రంథంగా అచ్చువేశారు. పైసంవత్సరపు అట్టి గ్రంథంలో వారు ఈ పెరియార్ విషయంకూడా పెద్దగా అచ్చువేస్తారనుకుంటాను.

కళా వెంకటరావుగారి వంటి జిజ్ఞాసాపరులు శాసనసభా సభ్యులు కాబట్టి అరవం తెలియని ఆంధ్రులకందరికీ పెరియార్ అంటే మహాత్ముడనే అర్థం తెలియవచ్చింది.

ఇందుకు ఆంధ్రులందరూ కళా వెంకటరావుగారికి కృతజ్ఞులై వుండాలి. శాసనసభవలని అనేకమైన ఉపయోగాలలో తెలియని వాటికి అర్థం తెలుసుకోవడం ఒకటి.

* * *

పబ్లిక్ హెల్తుబిల్లులో శ్రీ రాజన్ మంత్రి విషసర్పాలని తాకలేదు. హిందూదేశంలో అన్ని ఘాతుక మృగాలవలని చావుకంటె విషసర్పాలవలని చావుహెచ్చు. అట్టి సందర్భంలో ప్రజారోగ్యవిషయకమైన శాసనంలో విషసర్పాల విషయం గుర్తించబడకపోవడం నిజంగా లోపమే.

అయినా శ్రీరాజన్ మంత్రి అది లోపమని అంగీకరింపడు. అతను ఇల్లా చెప్పాడు:

‘సర్పాలకి, పాపం, శాసనసంబంధమైన ఇలాకా వుండకుండడం మంచిదని అనుకున్నాను. కాని ఆరోగ్యశాఖవారు వాటికికూడా శాసనసంబంధమైన ఇలాకా వుంచాలనే పట్టుదలతో వున్నట్లు తోస్తుంది. కాని సర్పాలవిషయంలో ఆరోగ్యశాఖామాత్యుడు బాధ్యత వహింపగలడని అనుకోను. అతడు వానిని తనపోర్టు ఫోలియోకు తీసుకోలేడు.

వాని కార్య కలాపాల్ని అరికట్టడానికి అతను శాసనం కానిరాలేడు. అనంతకాలంనుంచీ సర్పాలు ఈదేశంలో ప్రాణుల్ని పీడిస్తూ వున్నాయి. అవి శాసనమనే బోనుకు దొరకవు. ఇంతకీ సర్పాల్లో నూటికి తొంభై ఆరు వంతులు విషసర్పాలుకావు. నాలుగువంతులు మాత్రం విషసర్పాలు. అవి అయినా వాటిని తొక్కితే కాని మనుష్యుల్ని కరవ్వు. సర్పాలవిషయంలో ఏదేనా శాసనంకావలిస్తే వానిని తొక్కకూడదనీ, తొక్కితే ప్రాణాపాయం వుందనీ మాత్రం చేయవచ్చు.’

ఇదీ అతని ధోరణి—

విష్ణుమూర్తి సర్పశాయి. శివుడు సర్పభూషణుడు. రాజన్ మంత్రి శాసనంలో మాత్రం సర్పాలకి పాన్పుస్థానమూ లేదు, భూషణస్థానమూ లేదు.

ఆరోగ్యచట్టానికీ, ఆసర్పాలికీ సంబంధంలేదు. ఆసర్పాలతో సంబంధం పెట్టుకున్న వాళ్ళకి ఆరోగ్యంలేదు, ఆయుర్దాయంలేదు. రాజన్ గారి అనుగ్రహ విశేషం—

* * *

ఆంధ్రరాష్ట్రింకంటె ముందు తుంగభద్ర ప్రాజెక్టు కావాలనే అదవాని ఆంధ్రసభలకు పోటీగా తుంగభద్ర ప్రాజెక్టుసంగతి ఏమైనా ముందు ఆంధ్రరాష్ట్రిం కావాలనే ప్రొద్దుటూరు ఆంధ్ర మహాసభలు వరకట్నాలు వద్దంటూ ఒకతీర్మానాన్ని చేశాయి.

తీర్మానమేనా చేసినందుకు మనం సంతోషించాలి. ఆమధ్య సింహళద్వీపం స్టేట్ కౌన్సిల్ ఇట్టి తీర్మానం చెయ్యడానికి కూడా అంగీకరించలేదు.

జోయ్ శా అనే సింహళద్వీప స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రెండు ఏళ్లుగా వరకట్నాలువద్దనే తీర్మానం తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. రెండుఏళ్ళకు పిమ్మట ఇటీవల అది స్టేట్ కౌన్సిలులో చర్చించబడింది.

చర్చించబడి ఏమి లాభం? డిప్యూటీ అధ్యక్షుని కాస్టింగు ఓటుతో ఆతీర్మానం వీగిపోయింది. రెండుఏళ్లు వేచివుండికూడా ఆతీర్మానం వీగిపోవడం విచారకరమైంది.

సింహళద్వీపంలో వరకట్నం

ఇప్పించలేని వధువుకు వివాహం కాదు. కట్నాలు ఇవ్వలేని తల్లి దండ్రులకు పుట్టిన కారణంచేత ఎంతోమంది ఆడపిల్లలు పెళ్లిళ్లు కాకుండా వుండిపోతున్నారు.

ఈస్థితి తొలగిద్దామని జోయ్‌శా వరకట్నాలు వద్దనే తీర్మానానికి రెండుసంవత్సరాలక్రితం నోటీసు ఇచ్చాడు. కౌన్సిల్ సభ్యులు దానిని ఒక హాస్యవిషయంగా తీసుకున్నారు. కాని కోరతగిన సంస్కరణగా తీసుకోలేదు.

ప్రభుత్వసభ్యుడు తీర్మానానికి స్వాగతం ఇయ్యలేదు సరికదా ఇదేమి అని జోయ్‌శా అడిగితే వరకట్నాల్నిగూర్చి పుస్తకాలేమన్నా వుంటే పట్టుకురమ్మని పరిహాసం చేశాడు.

మరోసభ్యుడు ఈతీర్మానంమీద మాట్లాడుతూ 1899 లో పోలీసు కోర్టు తీర్పుఒకటి వివాహం ప్రేమతోకంటె ముఖ్యంగా కట్నంతో అయ్యేపని అని నిర్ణయించివుందని చెప్పాడు.

వరకట్నాలు వద్దని తీర్మానం తెచ్చిన జోయ్‌శాకు సభ్యుల ఈ ధోరణికి కోపంవచ్చింది. అందుమీద సభ్యుల్ని లంకించుకున్నాడు. 'మీరు మీపెళ్ళి కాలాల్లో పెద్ద పెద్ద కట్నాలుపుచ్చుకుని ఆధనాన్ని మొన్నటి ఎన్నికలకోసం తగలేశారుకాబట్టి వరకట్నాలు వద్దని నేను తీర్మానంతెస్తే దానికి అనుకూలంగా వుండడానికి మీకు మొగం చెల్లటంలేదు' అన్నాడు.

ఇల్లా ఆడిపోసినా ఆసభ్యుల తిక్క కుదరలేదు. తీరాతీర్మానం ఓటుకు వచ్చేసరికి తొమ్మండుగురు అనుకూలంగానూ, తొమ్మండుగురు ప్రతికూలంగానూ ఓటుచేశారు.

డిప్యూటీ అధ్యక్షుడు తన కాస్టింగు ఓటు ప్రతికూలపక్షంలో పడవేశాడు. అతనికికూడా వరకట్నాలు వద్దనడం ఇష్టంలేక పోయింది.

ఇందుకు రెండుకారణాలు వుండవచ్చు.

ఒకటి : వివాహకాలంలో అతను విశేషంగా కట్నంపుచ్చుకుని వుండడం – లేదా.

రెండు : వివాహవయస్సు వచ్చి వరకట్నం బాగా లాగగల కొడుకో, కొడుకులో అతనికివుండడం.

ఏమైతేనేమి — సింహళద్వీపంలో పెళ్ళికొడుకుల పుణ్యం ఇంకా బాగానేవుంది. వివాహకాలంలో వారు వరకట్నాలు గుంజడానికి ప్రభుత్వం ఏమీ అడ్డుపెట్టదు.

* * *

శ్రీమాన్ రాజగోపాలాచారి ఉపమాలంకారప్రియత్వం ఆంధ్రభూమి పాఠకులకు బాగా పరిచితమైనది.

ఆ ఉపమాలంకారప్రియత్వంలో ఆయన ఒక్కొక్కప్పుడు ఉచితానుచితాలను కూడా మరిచిపోతూవుంటారు.

మలబారు దేవాలయ హరిజన ప్రవేశ చట్టాన్నిగురించి మాట్లాడుతూ ఆచారిగారు జడుపుజ్వరానికి ఒకమందు చెప్పారు.

'ఒక పిల్లవాడు ఒక గదిలో కాని ఒకసందులో కాని వున్నచీకటికి భయపడి అక్కడికి పోవడానికి సంకోచిస్తాడనుకోండి. అప్పుడు మీరు వాడిని చెయ్యపట్టుకుని ఆచీకటిగదిలోనికి కాని, ఆచీకటిసందులోనికి కాని గబగబా లాక్కొని వెళ్ళండి.

అందుతో ఆకుర్రాడికి జడుపుజ్వరం వదులుతుంది. చన్నీళ్ళతో నిండివున్న తొట్టిలో ప్రవేశించడానికి ఒక కుర్రవాడు పిరికిపడుతున్నాడనుకోండి, అప్పుడు ఆకుర్రాడిని గబుక్కున అందిపుచ్చుకుని తొట్టిలోకి తొయ్యండి. అనంతరం వాడే ఆనందిస్తాడు.'

శ్రీరాజగోపాలాచారి చెప్పినట్లు వాడు ఆనందించవచ్చు— లేదా షాక్ తగిలి చనిపోవచ్చు— లేదా జడుసుకుని శాశ్వతంగా ఆరోగ్యాన్ని భంగించుకోవచ్చు. చీకటిని చూచి భయపడే కుర్రవాడికి శ్రీరాజగోపాలాచారి సూచించే చికిత్స పనిచేయవచ్చు. లేదా హఠాత్సంభవం కావడంచేత అతని నరాలు సడలడమూ, అతనికి పిచ్చి కలగడమూ జరగవచ్చు.

శారీరకశాస్త్రం, ఆరోగ్యశాస్త్రం ఏమాత్రం చదివినవాడైనా ఈవిషయం అనుభవపునరుక్త

మాతుంది. అయితే శ్రీరాజగోపాలాచారి ఇట్లా శాస్త్రజ్ఞానం లేనివాడిలా మాట్లాడడానికి ఏమిటి కారణం?

కారణం ఏమీ చెప్పలేం—పోనీ రాజాజీ తెలియక చెప్పాడనుకుందాం. ప్రక్కనువున్న ప్రసిద్ధవైద్యుడు, ఆరోగ్యశాఖామాత్యుడు రాజన్ మంత్రేనా ప్రధాని ప్రమాదాన్ని ఎందుకు సవరించలేదు?

తనకు సభ్యత్వం, మంత్రిత్వం ఇచ్చిన రాజాజీగురువుకి పదిమందిలో పంగనామం పెట్టడం ఇష్టంలేకపోవడం చేత కాని—

ఎదటపడి మాట్లాడితే రాజాజీ డిసిప్లిన్ కత్తి జడిపించవచ్చుననే భయం ఉండడంచేత కాని.

రాజాజీని రాజన్ మంత్రి సవరించి వుండకపోవచ్చు.

ఈ సందర్భంలో మద్రాసు మెయిలు మద్రాసు రాజధానిలో పిల్లలతండ్రుల కందరికీ ఒక హెచ్చరిక చేసింది దయచేసి రాజాజీచికిత్సమాత్రం అవలంబించవద్దని—

ఇంతకీ మలబారు దేవాలయ హరిజన ప్రవేశచట్టం విషయంలో రాజాజీ ఇట్టి దారుణసాదృశ్యాన్ని ఎందుకు తెచ్చాడో?

* * *

చదువుకున్న మగవాళ్ళల్లో ఇప్పుడు నిరుద్యోగం బాగా ప్రబలివుంది. చదువుకున్న ఆడవాళ్ళకి మాత్రం ఉద్యోగాలు బాగా దొరు

కుతూనే వున్నాయి.

ఈ పరిస్థితుల్లో భార్యాభర్తలు ఇద్దరూ చదువుకున్నవారై ఇద్దరూ ఉద్యోగాన్వేషణ చేస్తూవున్నవారైతే భార్యకు ఉద్యోగందొరకడం—భర్తకు దొరక్కపోవడం జరుగుతూవుంది.

అయితే ఒకసంగతి భర్తకు ఉద్యోగం దొరికితే అతడు భార్యను భరింపక తప్పదు. భరించేవాడు భర్త, భరింపబడేది భార్యఅని పెద్దలే నిర్ణయించి ఆపేర్లు వారివారికి పెట్టారు. మన ప్రభుత్వంవారు కూడా క్రిమినల్ ప్రొసీజరు కోడ్ 488-వ సెక్షన్ప్రకారం భర్త తనభార్యను పోషించవలసినవాడుగా నిర్ణయించారు.

భార్యలపట్ల ఇట్టి బాధ్యత ఏమీ కనిపించదు. భార్యకు భర్తను పోషింపవలసిన బాధ్యత ఏమీ లేదు.

పూర్వపుస్థితిలో ఇట్లావున్నా ఏమీ బాధవుండేది కాదు. కాని ఇప్పుడు ఉద్యోగినులు అయిన భార్యలకు ఉద్యోగంలేని భర్తలు ఉంటూవుండడం తఱుచు సంఘటిస్తూవుంది.

కాబట్టి ప్రభుత్వంవారు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కు సవరణ తెచ్చి ఉద్యోగినులయిన భార్యలు ఉద్యోగంలేని భర్తల్ని పోషించాలని శాసననిర్ణయం చేయాలి.

అట్లా చేయకపోతే ఉద్యోగినులయిన భార్యలు ఉద్యోగంలేని భర్తల్ని పోషించకుండా వదిలిపెట్టి వేయవచ్చు—సంఘం ఇట్టి దుస్థితిలో పడకుండా ప్రభుత్వం జాగ్రత్తపెట్టాలి.

వి. విశ్వనాథము.

ఇట్టి తల్లులకు ఆంధ్రభూమి ఎల్లప్పుడు పంటపొలమగుచుండును గాక!

మహనీయుల మాతృదేవులు

ఉయెల ఊచెడు చెయ్యియే ఊళ్లు ఏలించగలదు. కావుననే లోకజ్ఞులగు పెద్దలు మడిచేతులతో 'మాతృదేవోభవ' అన్నారు. మాతల ప్రభావము మాన్యమైనది.

రచయిత:

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్. యం. ఇ.

ప్రతి మానవుని జీవితసౌధమునకు బలమైన పునాదివేసేశక్తి మాతృమూర్తిలో మూర్తీభవించి వుంది. ప్రతిమాతయు అది గుర్తించకపోయినచో అట్టి తల్లుల లాలనలో పెరిగిన బాలబాలికలు వారివారి భావిజీవితభవనములు భవ్యముగ నిర్మించికొనలేరు.

బంకమన్నువలె పాకిపోవు శైశవావస్థను తీర్చిదిద్ది ఒక మార్గమందు నడిపేశక్తి మాతృదేవివద్ద నున్నది. తమశక్తిని గుర్తెరుంగని తల్లులుండు దేశములు అధోగతియందే వున్నవి. తమ విధ్యుక్తధర్మమును తెలుసుకొని తమ బాలురను ఆత్మదేశవువీరులుగా చేసిన వీరమాతలుద్భవించిన దేశము లెంతేయు ఔన్నత్యశిఖరము లంటియున్నవి. ఆ వీరమాతల జీవితములు ధన్యమైనవి.

క్లిష్టపరిస్థితులలోపడి పాడువడుటకు సిద్ధముగానున్న దేశములను తమశక్తిని ధారపోసి పైకితీసుకొని వచ్చిన నేటి నియంతలకందరకు వారివారి తల్లులే ప్రథమగురువులని, వారిబోధనలే వారిని స్వజాత్యాభిమానులుగా చేసినవని చరిత్రలవల్ల విశదమగుచున్నది.

శివాజీ, నెపోలియన్, పిల్సుడుస్కీ, ముసోలినీ, లెనెన్, స్టాలిన్, మాజరిక్, రామరాజువంటి జాతీయవీరులు ఎంత పూజనీయులో వారినికన్న తల్లులు అంతకు పదిరెట్లు ఆరాధనీయులు.

వీరత్వము కుంటివడియున్న మనకు ఆవీరనారీమణుల జీవితములు అవశ్యపఠనీయములైనవి.

అభిమన్యుని తల్లి

అభిమన్యుడు పుట్టుకతోనే వీరుడైనాడు. ఏల? సింహము కడుపున పిల్లిపుట్టునా? సుభద్ర వీరవనిత. బాలుడు తల్లిదండ్రుల ప్రతిబింబమే కదా! అభిమన్యుడు పద్మవ్యూహభేదనము కడుపులోనుండి వినలేదు. కాని సుభద్రశరీరములోని ప్రతి అణువు వీరగాథలతో ఉడికి ఉప్పొంగి పోయినది. ఆరక్తమేగా అభిమన్యుని శరీరములో ప్రవహించినది!

అట్టి అపూర్వసంఘటనలే ఆధునికయుగమందలి వీరమాతలకు కూడ కలిగినవి.

నెపోలియన్ తల్లి

నెపోలియన్ తల్లి తండ్రులు పలు యిక్కట్లకు లోనైనారు అతడు గర్భములోనున్న కాలమందు, ఆతల్లి భర్తతోకలిసి శత్రువులతో పోరాడి అడవుల వెంబడి పోవలసివచ్చినది. ఆ అపజయపరాభవానలములో పుట్టినవాడు నెపోలియన్. తనదేశమును దాస్యమునుండి తొలగించు పుత్రుని కోరుటయే అప్పటి ఆమె వాంఛితము.

ఆమెయే ఆశూర శిఖామణికి గురువు. అడవులలో కటికిరాళ్ళపై పుట్టిన ఆపేదబాలుడు అచిరకాలమందే తల్లియొక్క మనోబలముచే ఫ్రాన్సుదేశమునకు సర్వాధికారి అయినాడు. అతనికి తల్లియందు అసదృశమైన ప్రేమ.

శివాజీ తల్లి

మహమ్మదీయుల క్రౌర్యమునకు అలమటించిన జిజియాబాయియొక్క విలాపఫలమే మహారాష్ట్ర సామ్రాజ్యస్థాపకుడైన శివాజీ జన్మరహస్యము. ఆమె మనోశక్తి, ధీరత్వము వర్ణనాతీతము.

ఆమె వీరత్వమును శివాజీకి ఉగ్గుపాలతో నూరిపోసినది. ఆ పవిత్రమాతృమూర్తి ఆశీర్వాదనను ప్రత్యక్షముచేసుకొన్న కుమారుడు శివాజీ. ఆమె ధీరత్వము ఆంధ్రవనితలకు ఆదర్శప్రాయమైనది, ఆచరణీయమైనది.

లెనిన్ తల్లి

రష్యా ప్రథమసామ్యవాద నియంత లెనెన్. అతనితల్లి జర్మన్ జాతీయురాలు. కాని తండ్రి రష్యా సైన్యంలో డాక్టరుకావడంచేత వారు రష్యాప్రజలుగానే పరిగణింపబడుచుండిరి. ఆమెపేరు మేరియా యులనోవా.

ఆమె కడుపుతో ఉండగా 1870 మే 5-వ తేదీని లండన్‌లో కారల్‌మార్క్సు ఉపన్యాసమువిన్నది. 'ఇప్పుడిప్పుడే రష్యాప్రజలు మన ఆశయములను అమలుజరుపుటకు మొదలు పెట్టుచున్నారు' అన్న మార్క్సు పలుకులు ఆమె హృదయఫలకముమీద గాఢముగా నాటుకుపోయాయి.

ఆమాటలు ముచ్చెపు చిప్పలో పడిన స్వాతి కార్తి వానచినుకుల వలె ఫలవంతమైనవి. మార్క్సు సిద్ధాంతములను క్రియారూపములో పెట్టుటకు నాకడుపుననే ఒకపిల్లవాడు పుట్టినఎంత బాగుండునో అని ఆమె అనుకున్నదట!

ఆ తలంపు ఏపవిత్రఘడియలో కలిగినదో నెలమీద పదునైదు రోజులకే ఆమెకు ఆణిముత్యము వంటి మన లెనెన్ జన్మించాడు. అతనికి మార్క్సునకు ఏదో అవ్యక్త సంబంధమున్నదని ఆమె యూహ. లెనెన్ అన్న-అంటే ఆమె ప్రథమపుత్రుడు-రాజహత్యానేరానికి ఉరితీయబడ్డాడు.అందుచే రాజభటులు వారిమీదనిఘా చూపేవారు. భర్త పరమపదించాడు. ప్రభుత్వం ఆమె భర్తయందుడే వాత్సల్యంకొద్దీ పెన్‌షనుయిస్తూ వచ్చింది. అదేవారికి జీవనోపాధి. కష్టపడి పుత్రునకు చదువుచెప్పించింది. తుదకు ఆపుత్రుడు రష్యా కార్మికులకు కల్పతరువై, జారు ప్రభువులకు యమధర్మరాజైనాడు : దీనికంతకును తల్లి ప్రబోధమే కారణము.

మాజరిక్ తల్లి

అధునాతనజెకోస్లావాకియా రాజ్యనిర్మాత మాజరిక్ తల్లి వియన్నాలోని సంపన్నగృహస్థుల యింట్లో దాసిస. ఎక్కువ విద్యావతికాదు. కాని అపరిమితదేశభక్తురాలు, ఆదర్శప్రాయమైన భార్య. పిల్లలపై అమితవాత్సల్యము. సంసారము అతి ఓర్పుతో దిద్దేది.

మాజరిక్ తండ్రి టీయిస్టేటులో మేస్త్రీ అక్కడ పనివాండ్ర పిల్లలు చదువుకోవాలంటే యజమాని అనుమతి వుండాలి. మాజరిక్ తల్లి తన కుమారుడు మతగురువు కావలెననికోరినది. కాని ఆచదువు ఒక్క శ్రీమంతులకే కాని బీదవారికి అందనిమ్రానిపండు.

ఆమె సంపన్నుల గృహాలను గూర్చి, వారివారి అలవాటులను గూర్చి కొడుకుకు బోధిస్తూవుండేది. వీరులకథలు చెబుతూవుండేది. ఆమె చదువుకునే పుస్తకాలలోని బొమ్మలు అవీ చూపి వానిని తెలియచెప్పేది. పెద్దలసుద్దులుచెప్పి అంతవాడవు కావాలి నీవు కూడ నాయనా అంటూ వుండేది.

మాజరిక్ వృద్ధాప్యంలో ఒకచోట వుపన్యసిస్తూ తన దేశసేవకు తన తల్లియొక్క పవిత్రప్రబోధమే మూలాధారమని వక్కాణించాడు.

పిల్సుడుస్కీ తల్లి

పూర్వం పోలెండు రాజ్యము ఇప్పటి ఆంధ్రదేశమువలెనే ఛిన్నాభిన్నమై పొట్లపండువలె బ్రద్దలైపోయింది. రష్యా, జర్మనీ, ఆస్ట్రియా ఎవరికి దక్కిన భాగములను వారు యినుపపిడికిలితో అదిమిపట్టిరి.

ఆ భల్లూకపుపట్టునుండి విడిపించి పోలెండును ఏకరాజ్యముగా చేసిన మార్షల్ పిల్సుడుస్కీ తల్లి వీరమాతలలో అగ్రగణ్యురాలు.

ఆమె శరీరము స్వదేశాభిమానముతో ఉప్పొంగి పోవునది. దేశదాస్యమునకు వగచునది. ఆమె బాల్యమునుండి దేశములోని పరప్రభుత్వము చేసే భయానకదృశ్యములను కళ్లారా చూచినది. ఆ పరరాజ్యపిశాచాన్ని నిర్మూలించునట్లు తనకుమారుని తయారుచేసింది. ఆమెపేరు మేరియా పిల్సుడుస్కా.

ప్రకాశవంతమైన శీలముకలది. విద్యావతి. విశేషించి వివేకవతి అయిన భార్య. పెద్దసంసారమును నేర్పుతో చక్కదిద్దే ధీశాలి. జాలిగొలిపే రూపం. తేజోవంతములైన నేత్రములు. బాల్యమునుండియు అనేకకష్టములను ఓర్పుతో ఎదిర్చినది.

ఆమె ధైర్యసాహసములనే ప్రతిబింబింప చేసుకొన్నాడు మార్షల్ పిల్సుడుస్కీ. ఆమెదీవించి యుద్ధమునకు పంపినది—భారత వీరాగ్రణి చంద్రగుప్తుని మురపంపినట్లు—ఆ వీరనారీమణి ఆశీర్వాదబలమే అతనికి విజయము కూర్చినది.

నేడు పోలెండు ఒక సుస్థిర రాజ్యమైనది. ఆ తనయునకు తల్లియందుండే అధికతర ప్రేమచే తననుకూడ తల్లిని సమాధిచేసిన స్థలమందే ఆమెపాదములవద్ద సమాధిచేయమని కడసారి కోరిక కోరునట్లు చేసినది.

కాని తాముతండ్రికన్న ఎక్కువ గౌరవముతో చూచుకొనే ఆ జాతీయవీరుని రాజులతో తులతూచవలెనని ఆప్రజలు ఆతని ఆ కడసారి కోరికను తీర్చలేకపోయిరి. ఆవీరమాత మనకు అభినందనీయురాలు, అభివందనీయురాలు కాదా ?

స్టాలిన్ తల్లి

నేటి రష్యానియంత ఉక్కుమనిషినికనిన ఉవిద పూజ్యురాలు. ఆమె జార్జియన్ జాతీయురాలు. ఆమెకు బాల్యమందే వివాహమైనది. కాగా బాల్యమందే గర్భంరావడం పుట్టే వాళ్ళు అక్కరకు రాకపోవడం సంభవించింది. ఆమెపేరు ఏకతెరినా. ప్రథమంలో పుట్టిన ముగ్గురు కన్ను తెరవకుండానే కడతేరిపోయారు. ఆమాతృమూర్తి వ్యథ వర్ణింపరానిది. ఎందరో దేవుళ్ళకు మొక్కుకుంది.

వన్నె తెచ్చే సంతానమే స్త్రీ జన్మకు ఆనందదాయకమైనదనే మతంగల మనిషి. చిరంజీవిఅయిన పుత్రుడు పుడితే భగవత్సేవకై విడిచిపెడతానని ప్రతిజ్ఞ చేసింది

అంతవాంఛతో కనిన కుమారునకు తండ్రి చనిపోతే తానే అర్ధరాత్రివరకు బట్టలుకుట్టి డబ్బు సంపాదించి చదువు చెప్పించింది. మానవసేవయే భగవత్సేవ అని ఆ వీరుడు తల్లికోరికప్రకారం రష్యాకార్మికులకు దేవుడైనాడు. ఆమెసంకల్పమేకదా స్టాలిన్ ప్రతిభకు పునాది. ఆమెఅంటే నేటి రష్యాలో ఆదరము, విధేయతా మెండు. ఆమె గోరీనగరమందు నివసించుచున్నది.

ముసోలినీ తల్లి

చితికి శిథిలమైపోనున్న యిటలీనిపట్టి పైకిలాగిన ముసోలినీ తల్లి కూడా ముసోలినీభావిని జోస్యము చెప్పినది. ఆమె దయాదాక్షిణ్యములకు నిధి. ఆమెకు పిల్లలమెడ ప్రేమ మెండు.

ఆమెపేరు డోనాగోసా. ఆమె ఒక ఉపాధ్యాయిని. భర్త మరణానంతరము ఒక చిన్న హోటలు పెట్టి సంసారం నడిపేది.

ముసోలినీ తండ్రి ముసోలినీచేసే అల్లరిపనులకు, కమ్మరకొలిమిలోని తిత్తిని సరిగా వూదనందుకు తోలుబెల్టుతో తొక్కలూడేటట్టు కొడుతూ వుండేవాడు. మెత్తనైనతల్లి పేగుకాబట్టి ఎందుకు కొడతారు వాడిపనీ నేర్చుకోకపోతేయేమి, వాడొకగొప్పవాడౌతా'డ నేది. ఆమాటలకు లోలోన మురిసిపోయేవాడు ముసోలినీ. అనంతరకాలములో ఆ మాటలే అతనిని పురికొల్పినవి. నియంత అయినాడు. ఆమాతృదేవి నేటికిని అంతర్హిత అయి తనను కాపాడుతోందనే అతని నమ్మకం. ఆమాతృప్రేమ వల్లనే అతడు ముందుకు సాగిపోయినాడు. పోతున్నాడు.

హిట్లర్ తల్లి

ఆస్ట్రియాను, సూడెటన్.లాం

లక్ష్యసిద్ధి

భారత బాలవీరులగూర్చిన వచననాటిక

రచయిత:

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

హస్తినాపురం బయట బ్రహ్మాండమైన అస్త్రవిద్యాసందర్శనరంగం యేర్పాటయినది.

భీష్ముడీయేర్పాటు గత సంవత్సరమే చేయించాలని సంకల్పించుకున్నాడు ; కాని కృపాచార్యుడు కొంచెం నిరుత్సాహం కనపరిచాడు. 'కుమారులందరూ శ్రద్ధగానే వున్నారు. అయితే, తమలో తాము పోటీలు పెట్టుకోడమే గాని, పెద్దలకిలాంటి వుద్దేశం వున్నదని వారెరుగరు. ఎరిగి వుంటే వుండే శ్రద్ధ వేరు. అప్పుడు జరిగే పరిశ్రమ వేరు. కనక, యిప్పుడీ సంగతి వెల్లడిచేసి వూరుకుందాం. దీనివల్ల కుమారులలో ప్రచ్ఛన్నాలై వున్న శక్తులన్నీ ప్రబుద్ధాలవుతవి' అని అతను చాలా దూరం చెప్పగా 'బాగుం'దని భీష్ముడంగీకరించి అప్పటికి వూరుకున్నాడు.

ద్రోణుడున్నూ యిందుకంగీకరించాడు.

సంవత్సరమూ తిరిగింది. తన బోధనాచాతుర్యం యెప్పుడు వెల్లడి అవుతుందా అని ద్రోణుడు రోజూ రోజూ తొందరపడుతున్నాడు; కాని కృపాచార్యుడు, తనకి, ఆదృష్టే లేనట్టు ప్రవర్తించసాగాడు. అతనికిన్నీ వుత్సాహం లేకపోలేదు ; అయితే, దాన్ని అణుచుకునే శక్తి వున్నదతనికి మొత్తానికి- ద్రోణుడులా కాక అతను కొంచెం 'స్వయంపాకం' మనిషి.

ఏమయినా చివరికి తప్పింది కాదు.

ముహూర్తం యేర్పడినది. సకలసన్నాహాలున్నూ పూర్తి ఐనవి.

ప్రధానప్రేక్షాగారంలో దేవీశత పరివృతుడై ధృతరాష్ట్రుడు కూచునివున్నాడు. గాంధారి అతని పక్కనేవున్నది. కుంతి కొంచెం యెడంగావున్నది. ఆమెతోటీ, ధృతరాష్ట్రుడితోటీ మాట్లాడ్డానికనువుగా వుండేటట్టు, విదురుడు, ఆ యిద్దరికీ మధ్య కూచునివున్నాడు.

భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలైన ప్రధానపురుషులు తమతమ ప్రేక్షాగారాల్లో వున్నారు. రాజబంధువులూ, పౌరప్రముఖులూ వితానంలో అర్హాసనాలలంకరించి వున్నారు.

వేలకొద్దీ పౌరులున్నూ ఉచిత స్థలాలలో కూచుని వున్నారు.

ఈప్రదర్శనంలో పాల్గొనే కుమారులందరూ వొక్కచోటనే వుండినా, వారిలో, కౌరవులూ తదభిమానులూ వొక పక్కగానూ, పాండవులూ తదనుయాయులూ మరొక పక్కగానూ విడిపోయి కూచుని వున్నారు.

మొదట సామాన్యుల ప్రదర్శనం అయిపోయింది. తరవాత ధర్మనందనుడూ, దుశ్శాసనుడూ, నకులసహదేవులూ - యిలాంటివారు తమ తమ చాతుర్యాలు చూపించారు.

అవన్నీ చూసి ప్రేక్షకులు సంతోషించకపోలేదు ; కాని వారికి తృప్తి కాలేదు. భీష్ముని ప్రతాపమూ, ధృతరాష్ట్రుని వీర్యమూ, పాండురాజు శౌర్యసాహసాలూ యెరిగివున్నవారు 'వారి వంశంలో యిలాంటివారెందుకుపుట్టారబ్బా' అనుకునేటట్టుగా వున్నవి వారి శక్తిసామర్థ్యాలు.

భీష్ముడు కొంచెం నిర్వేదం కనపరిచాడు. విదురుడు, 'ఫలానావారు రంగానికి వచ్చా'రని మాత్రమే చక్రవర్తితో చెప్పి వూరుకోసాగాడు. కృపాచార్యుడున్నూ వుత్సాహం కనపరచలేకపోయాడు. ద్రోణుడు వెంటవెంటనే సైగలిచ్చేస్తూ వచ్చాడు.

మీద వుండడం గుర్తించి, కర్ణుడున్నూ మాటిమాటికీ సుయోధనుణ్ణి విడిచి ద్రోణుణ్ణీ, ద్రోణుణ్ణి విడిచి సుయోధనుణ్ణీ చూస్తూ బుస్సలు కొడుతూ వుండడమూ గమనించి, స్వగతంగా నాలుక కరుచుకుని గప్చిప్పుగా వూరుకున్నాడు.

కృపాచార్యుడు అందరి యింగితమూ కనిపెడుతూనూ వున్నాడు. ద్రోణుడి అస్వాతంత్ర్యానికి మురిసిపోతూనూ వున్నాడు.

'ధనురాచార్యులవారు అర్జునుడికి వుజ్జీ యేర్పరచ రేమీ?' అని నిర్భయంగా గుసగుసలు రేగాయి. కర్ణుడొక్కడే అర్జునుణ్ణెదురుకో గలవా డనీ, కర్ణుడి ముందు అర్జును డెలాగా తీసికట్టయిపోతా డనీ, యిది తెలిసే ద్రోణు డిలా చేశా డనీ, కొందరు కొంచెం స్పష్టంగానే అనుకున్నారు.

ఈగుసగుసలవల్ల, అప్పటిదాకా నిస్తరంగసముద్రం లా వున్న ఆరంగస్థలం గాంభీర్యం భంగపడిపోయింది.

భీష్ముడు పూర్తిగా విసిగిపోయాడు. ధృతరాష్ట్రుడు ఇక కట్టిపెట్టగూడదా? అనేద్దా మనుకుంటున్నాడు. కర్ణుడు 'ఇక ఆగలేను. వెళ్ళి వురుకుతా' అన్నట్టు సుయోధనుడి కేసి ఆకొన్న సింహప్పిల్లలా చూశాడు. సుయోధనుడున్నూ అంతకంటెనూ తొందరపడుతూనే —మొదట కొంచెం తటపటాయించి చివరికి 'యేమయినా కానీ' అని సాహసించి, గభీ మని కర్ణుణ్ణి రెక్కపట్టుకు లేవతీసి 'ఇక మాట తక్క' దన్నట్టు ద్రోణుడి కేసి వులుకూ పులుకూ చూశాడు.

ఇదంతా చూసి, ద్రోణుడున్నూ, తన నిండుహృదయం ప్రేరేపించగా, వొక్కమాటు భీష్ముడి కేసి తీవ్రంగా చూసేసి కళ్ళతో కర్ణుడికి ఆజ్ఞ యిచ్చాడు.

ద్రోణుడు చూపు లందాయి. అంతే. కర్ణుడు, వొక్కదూకున

రంగద్వారంలో వురికి దండ చరిచి నిలవబడ్డాడు.

ఆధ్వనికి అర్జునుడు వులిక్కిపడ్డాడు. ప్రేక్షకులు దద్దిరిల్లిపోయారు.

కర్ణుణ్ణి చూసి కృపాచార్యుడు గతుక్కుమన్నాడు.

భీష్ముడి హృదయం కలచినట్టయిపోయింది.

ఈసంగతి విదురుడు చెప్పగా, ధృతరాష్ట్రుడు చాలా గంభీరంగా మందహాసం చేశాడు.

[ప్రేక్షకజనసముద్రం వొక్కసూటు గమ్మున పొంగిపోయింది.

మళ్ళీ అంతటా గాంభీర్యం నెలకొన్నది.]

కర్ణుడు

(ఎదురొమ్ము విరుచుకుని సగర్వంగా) అర్జునా! ఇప్పుడిక్కడ విద్యార్థులలో ప్రతివాడూ నువ్వు చూపించిన చమత్కారాలన్నీ చూపించగలడు. వీరిలో కొందరు నీకంటే యెక్కువ విశేషాలే కనపరచనూ గలరూ. నువ్వొక్కడవే రంగంలో నుంచుని మహామహావాడిలాగ గారడీ చెయ్యడం విశేషంలోది కాదు. మనం యిద్దరమూ ద్వంద్వయుద్ధం చేద్దాం చేత నయితే కాసుకో.

అర్జునుడు

(వెంకెతనంగా) పలువా! ఇక్కడికి నిన్నెవరు పిలిచారూ? పరాత్మపరిమాణాలెరక్కుండా వాగడానికి నీ కెవరనుజ్ఞ యిచ్చారూ?

సుయోధనుడు

(తృణీకారంగా మందహాసం చేసి) అర్జునా! బుకాయింపులు చాలించు. (దృఢస్వరంతో) కర్ణుణ్ణి నేను పంపాను.

ద్రోణుడు

(విసుగ్గా) అర్జునా! అంత తొందరయేమీ? కర్ణుణ్ణి నేనున్నూ పంపాను.

అర్జునుడు

(సిగ్గుపడి తలవంచుకుంటాడు)

కర్ణుడు

(నిర్లక్ష్యంగా) అర్జునా! నాకు అలుగులతో జవాబు చెప్పు. నోటి తుంపర్లతో కాదు. ఈరంగభూమి అస్త్రవిద్యావిశారదుల కందరికీ సామాన్యమైనది. ఇక్కడ 'వీరికి ప్రవేశమున్నది, వీరికి లేదు' అని విధినిషేధాలెవరికీ లేవు, తెలుసా? ఇక్కడ నీ విశిష్టత యేమీ లేదు. మిడిసిపడకు.

ధర్మనందనుడు

(నిట్టూర్పు విడిచి తల వంచుకుంటాడు)

భీమసేనుడు

(గుండెలమీద చెయ్యి వేసుకుని) మనకి జంకేమిటోయ్? అర్జునా! ఊఁ - కానియ్యి.

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) ఆచార్యులవారు వారి కిద్దరికీ వుజ్జీ వేశారేం పాపమూ?

విదురుడు

(కుంతితో జనాంతికం) ధనుర్విద్యలో వారి కిద్దరికే పోలిక వున్నది. ఎటు చూసినా మరి మూడోవాడు కనపడడు.

కుంతీదేవి

(మళ్లీ విదురుడితో జనాంతికం) ఇది సౌమ్యంగా తప్పిపోయే వుపాయం చూడండి.

విదురుడు

(మళ్లీ కుంతితో జనాంతికం) ఏమీ లాభం లేదు. వారి కిద్దరికీ పోటీ జరగవలసిందే. మన మిప్పు డేమి మాట్లాడినా మర్యాద తక్కదు.

సుయోధనుడు

కర్ణా! ఏమిటి తరువాయి?

కర్ణుడు

నా ప్రత్యర్థనానికి మారుమాట లేదు.

భీష్ముడు

అప్రస్తుతప్రసంగాలతో కాలహరణం కావడం యేమీ బాగాలేదు, ధనుర్భాషా

ర్యులవారిప్పుడేమి సెలవిస్తారు? అర్జునుడూ కర్ణుడూ తలపడతారా, తలపడరా?

ధృతరాష్ట్రుడు

దానికి ప్రత్యుత్తరం యివ్వవలసినవారెవరూ?

విదురుడు

ముందు అర్జునుడు. అతను తప్పితే, తరవాత, ఆచార్యులవారు.

అశ్వత్థామ

అర్జునుడు తప్పడం యెందుకు రావాలీ?

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) మామయ్యగారూ, బావగారే కాకుండా మీరు కూడా యెగసనతోస్తారేం కర్మమూ?

విదురుడు

(కుంతితో జనాంతికం) వ్యవహారం వశం తప్పింది. ఘర్షణ పెరక్కుండా వడిమళ్ళరు. అన్నిటికీ అర్జునుడి మిడిసిపాటు ప్రాణాంతకంగా వున్నది.

కుంతీదేవి

(మళ్లీ విదురుడితో జనాంతికం) అదే వచ్చింది పుట్టిమునక. కర్ణుడనే టప్పటి కతగాడు మరీ యెగిరిపడిపోతాడు. అందరూ అతనిదే తప్పంటూ వుంటారు.

విదురుడు

(మళ్లీ కుంతితో జనాంతికం) దాసికొడుకేం చెయ్యగలరూ?

భీష్ముడు

కర్ణా!

కర్ణుడు

కన్నెత్తి చూడడానికూడా గుండెలు తాళడం లేనట్టుంది, యిక నేనేం చెయ్యను మహాప్రభూ?

ధర్మనందుడు

తమ్ముడూ! (లోపల్లోపల పళ్లు కొరుక్కుంటూ తీవ్రంగా చూస్తాడు)

భీమసేనుడు

ఎందుకు తమ్ముడూ, మాటలు ముదరనిస్తున్నావూ?

అర్జునుడు

(ఒక్క మాటు ధర్మనందనుడికేసి తేరిపారి చూసి) పెద్దలందరూ వొకచే విధంగా సెలవిచ్చాటప్పుడిక నాకేమి సందేహమూ? కర్ణా! మరి రా.

[ప్రేక్షకులు పెద్ద కోలాహలం చేస్తూ వుండగా కర్ణుడూ అర్జునుడూ ద్వంద్వయుద్ధం ప్రారంభిస్తారు. కొంతసేపు సమానంగా పోరు జరిగిన తరవాత కర్ణుడు పర్జన్యాస్త్రం ప్రయోగిస్తాడు. పెద్ద మేఘపటలం వచ్చి అర్జునుణ్ణి కప్పేస్తుంది. అర్జునుడు తప్పించుకోలేక అవస్థ పడుతూ వుంటాడు. ప్రేక్షకులు రణగొణ ధ్వని చేస్తారు. ఇదంతా చూడలేక కుంతీదేవి మూర్ఛపడిపోతుంది. విదురుడు చందనోదకాసేకం చేసి ఆమెని తేరుస్తాడు. అప్పటికి, అర్జునుడు, అతికష్టంమీద తేరుకుని, అనిలాస్త్రం ప్రయోగించి ఆమేఘపటలం విడగొట్టి బయటపడతాడు. ఇదంతా చూస్తూవున్న ద్వంద్వయుద్ధసమాచారనిపుణుడు, కృపాచార్యుడు, అర్జునుణ్ణి రక్షించాలని నిశ్చయించుకుని రంగంలో ప్రవేశిస్తాడు.]

కృపాచార్యుడు

(గభీమని కర్ణార్జునులకు మధ్య నుంచుని) ఆగండి. శాంతించండి.

[ప్రేక్షకులలో పెద్ద కోలాహలం రేగి కొంతసేపటికి అణగారుతుంది. ద్రోణుడూ, భీష్ముడూ విదురుడూ అది చూసి వులిక్కిపడతారు.]

కర్ణుడు

ఏమీ ఎందుకాగాలీ? శాంతించవలసిన అగత్యం యేమివచ్చిందీ యిప్పుడూ?

కృపాచార్యుడు

(స్థిరనిశ్చయంతో) వచ్చింది. కనక నే ఆగమన్నాను. తెలిసిందా?

ద్రోణుడు

(తీక్ష్ణంగా చూస్తూ) ఏమిటీ అగత్యం? ఎవరికీ తోచనిది నీకేలా తోచింది?

భీష్ముడు

ఎవరితో చెప్పి, ఎవరి సెలవు పొంది తమరీ పని చేశారూ?

కృపాచార్యుడు

నావొక్కడిమీదనే బాధ్యత అంతా

వుందని కాదు. (భీష్ముడితో) ఈసన్ని వేశం తమకి బోధపడనిదా?

విదురుడు

పనిపడితే ధనురాచార్యులవారికీ, పెద్ద బాబయ్యగారికీ కర్ణార్జునులను ఆపు చెయ్యదగిన సత్తా చాలదా?

కృపాచార్యుడు

ఇంత చిన్నపనికి కూడా వారు పూనుకోవాలా?

కర్ణుడు

ఇది చిన్న పనేనా?

ధృతరాష్ట్రుడు

పెద్దబాబయ్యగారి ప్రశ్నకి తమ సమాధానం యేమిటి కృపాచార్యుల వారూ?

కృపాచార్యుడు

మనవి చేసుకుంటున్నాను. మహా ప్రభూ!

కర్ణుడు

మొదలే వారి సెలవు పొందకపోడానికిన్నీ కారణం—(అర్ధోక్తి)

కృపాచార్యుడు

(రోషంతో) మిడిసిపడకు. కర్ణా! అధికప్రసంగం కట్టిపెట్టు. అర్జునుడు కురుకులజుడు. పాండుమహారాజులుంగారికీ, కుంతీదేవమ్మవారికీ పుత్రుడు. రాజధర్మ బంధురచరిత్రుడు. మరి నువ్వు? నువ్వితనితో యుద్ధం చెయ్యాలంటే నీవంశం యేదో, నీతల్లిదండ్రు లెవరో చెప్పు. నువ్వు రాజ వైతివా, యితను నీతో పెనగులాడతాడు. లేకపోతే లేదు. ముందిది తేలాలి.

కర్ణుడు

(హేళనగా) ఆచార్యులవారి కిప్పటికి తోచింది రక్షణోపాయం. అయితే, మహాత్మా! ఇంతవరకూ తమరు కునికిపాట్లు పడుతున్నారా, ఇంతా జరిగాక, అర్జునుడు, ఈక్షణంలో హఠాత్తుగా రాజపుత్రు డైనాడా? ఇప్పటిదాకా నాతో ధ్వంద్వయుద్ధం చేసినందుకు అతనికేదయినా ప్రాయశ్చిత్తం విధించబోతున్నారా తమరు?

[ప్రేక్షకులుమళ్ళీ కోలాహలం చేస్తారు]

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) కృపాచార్యులవారు డొంకంతా కదుపుతున్నారు. వారిని ఇప్పు డయినా కూచోమనకూడదూ?

విదురుడు

(కుంతితో జనాంతికం) కదిలేపోయింది. ఇక అట్టుపుట్టాణీ లన్నీ బయటికి వస్తాయి. ఇప్పుడు యిక కృపాచార్యుల వారు కూచున్నా వొకటే, నుంచున్నా వొకటే.

ధృతరాష్ట్రుడు

రాజపుత్రులతో కలిపి ధనుర్వేదం వుపదేశించడానికి ద్రోణాచార్యులవారికీ తమకిన్నీ అభ్యంతరం లేనప్పుడు—సుధురుడితో—తనకంటే వొక వన్నె యెక్కువే అయినవాడితో— యువరాజు ప్రాణసఖుడితో — ఎవరితో భుజమూ భుజమూ రాసుకుంటూ తా నింతవరకూ విద్య నేర్చుకున్నాడో ఆసహాధ్యాయితో ఇప్పటి దాకా యెదిరించి తాను ద్వంద్వయుద్ధం చెయ్యనే చేసిన కుమారకర్ణుడితో— మరికొంత సేవు ద్వంద్వయుద్ధం చెయ్యడానికి అర్జునుడికి ఆభిజాత్యం అడ్డు వచ్చిందా?

భీష్ముడు

ఆజ్ఞాపించిన ధనురాచార్యులవా రిప్పుడిందు కేమంటారూ?

ద్రోణుడు

ఇది పూర్తిగా ధర్మాతిక్రమణం. తలకి మించిన పని. వ్యవహారం చాలా తప్పింది. ఇక సర్వానికీ తమరే వున్నారు.

విదురుడు

అది సరే. మరి ప్రకృతం?

కుంతి

(విదురుడితో జనాంతికం) వీరు మళ్ళీ పెల్లగిస్తా రేం పాపమూ?

విదురుడు

(కుంతితో జనాంతికం) ఇక మే మిక్కడ వుండి యేమి ప్రయోజనం? జయాపజయాల ప్రశ్న కాదిది. ఒకడి స్వత్వాలకు భంగం వచ్చింది. దీనికి ధర్మ నిర్ణయం చెయ్యకతప్పదు.

దుశ్శాసనుడు

అర్జునా! ఏకలవ్యుడి విషయంలో పన్నిన యుక్తి వంటిదే కర్ణుడి విషయంలో కూడా పన్నుకుని వుంటే నీ కిప్పుడీవిషమసంధి రాకపోవును గాదుటోయ్?

భీమసేనుడు

ఇప్పుడు వచ్చింది మాత్రం యేమిటోయ్?

దుశ్శాసనుడు

కర్ణుడితో చాలలేక మరో విధంగా గోడ దూకెయ్యవలసిన దుష్కర్మోయ్!

భీమసేనుడు

(మండిపడుతూ లేవబోతాడు)

ధర్మనందుడు

(భీముణ్ణి అదిమిపెడుతూ)

భీమసేనా!

విషయం పెద్దలలో నలుగుతున్నది. వూరుకో.

సుయోధనుడు

ఇది పెద్దలలో నలగడమే గుణమయితే కావలసినంత నలగవచ్చు. నలగవలసినది కూడా చాలానే వున్నది.

గుండె లుంటే 'నేనూ' అంటూ యెదట యెవ రయినా సరే నిలవబడవచ్చు.

ధృతరాష్ట్రుడు

కృపాచార్యులవా రింకా యిక్కడే వున్నారా!

కృపాచార్యుడు

ఏమీ వుండకా? పవిత్ర మైన భరత కులగౌరవం కాపాడడానికి నావూనిక. దీనికి మహ్మాలినవా రేం సెల విప్పిస్తారూ?

ధృతరాష్ట్రుడు

(వెటకారంగా చిరునవ్వు నవ్వి) ఆ విషయం పెద్ద బాబయ్యగారితో మనవి చెయ్యండి తమరు.

భీమసేనుడు

ఎవరు, ఎవరితో మనవి చెయ్యా డాని కయినా కర్ణుడు, అచ్చంగా, సూతపుత్రుడు. ఇందులో యెవ రెరగని దేమి వున్నదీ?

సుయోధనుడు

నిజమే. ఎవరూ యెరగం దేమీ లేదు. ఎవరూ మేమీ దాచడమూ లేదు. దాచవలసినదిన్నీ లేదు. భీమసేనా! రెండు కళ్లూ బాగా తెరుచుకు చూడు. మీ అయిదుగురి తేజస్సూ యేకం అయినా కర్ణుడి తేజస్సులో సహస్రాంశం అయినా అవుతుం దేమో పరకాయించుకో. ఇంతటి తేజస్వి అధమాన్వయంలో పుడతాడేమో చేతనైతే ఆలోచించుకో. లేడి కడుపున పులి పుడుతుందా? ఋషుల జన్మమూ, సురల జన్మమూ, యేరుల జన్మమూ తెలుసుకోడం యెవరి కయినా సాధ్యమా? సత్క్షత్రియ ప్రభువు లనేకులు విప్రులవల్ల పుట్టలేదూ? ఇంద్రుడి వజ్రాయుధం యెక్కడ పుట్టిందో, కుమారస్వామి పుట్టుక యెక్కడో, ద్రోణాచార్యులవారి జన్మ యెక్కడో విన్నావా? ధర్మవిదులైన యీ—మన-కృపాచార్యులవారు రెల్లుగడ్డిలో పుట్టారు తెలుసా? ఇంతెందుకోయ్? మీ అన్నదమ్ముల అయిదుగురి జన్మలూ యెలాంటివోయ్?

భీమసేనుడు

(తలవంచుకుంటాడు)

ధర్మరాజు

(తలవంచుకుంటాడు)

అర్జునుడు

(పెడమొగం పెట్టుకుంటాడు)

ధృతరాష్ట్రుడు

(కొంచెం వుత్సాహం కనపరిచినట్టు కనపడతాడు)

భీష్ముడు : విదురుడు

(ఒకరి మొగ మొకరు చూసుకుంటారు)

గాంధారి

(మొగం చిట్లించుకుని అయిష్టత కనపరుస్తుంది)

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) సుయోధనుడు కొడవలి పుచ్చుకుని పేగులు కోసేస్తున్నాడు.

విదురుడు

(కుంతితో జనాంతికం) అతని చేతికి, ఆకొడవలి, మన భీమసేను డందిచ్చాడు.

కుంతీదేవి

(మళ్ళీ విదురుడితో జనాంతికం) ఇంతటితో అయినా యిది తుంచెయ్యండి.

విదురుడు

(మళ్ళీ కుంతితో జనాంతికం) దాని కదే తునిగిపోయింది. ఇక మిగిలిం దేదేనా వుంటేనా! (కృపాచార్యుడితో) కృపాచార్యులవా రిది స్వబుద్ధితో నే చేశారా.

సుయోధనుడు

నేను కృపాచార్యులవారిని సవినయంగానే ప్రార్థిస్తున్నాను. అయితే నా కిప్పుడు కచ్చిత మైన జవాబు కావాలి. కర్ణుడి ప్రశ్నకి తమ ప్రత్యుత్తరం యేమిటి ధర్మాత్మా!

కృపాచార్యుడు

(తలవంచుకుని వూరుకుంటాడు.)

సుయోధనుడు

ఇది ఆషామాషీగా తేలిపోతుందని భ్రాంతి పడవద్దు. నాకు ప్రత్యుత్తరం చెప్పితీరాలి.

కృపాచార్యుడు

(మాట్లాడడు)

సుయోధనుడు

నేను నిర్మొగమాటంగా అడుగుతున్నాను. ఇందులో తమకి ప్రత్యేక శ్రద్ధ వున్నదా, లేదా!

భీమసేనుడు

పెద్దలకు దురుద్దేశా లారోపించడం-(ఆర్థోక్తి)

ధర్మనందనుడు

(భీముడి తొడ చరిచి) ఇస్స్!

భీమసేనుడు

(వూరుకుంటాడు)

ధృతరాష్ట్రుడు

విదురా!

విదురుడు

ఏమి సెలవు.

ధృతరాష్ట్రుడు

కృపాచార్యులవా రేం చేస్తున్నారూ!

విదురుడు

నిర్వికల్పసమాధిలో వున్నారు.

ధృతరాష్ట్రుడు

బాగుంది.

సుయోధనుడు

ఇప్పటికే చాలా కాలహరణం

దుశ్శాసనుడు

అర్జునుణ్ణి తప్పించడానికి మరో ఉపాయం వెదుకుతున్నారా వారు?

భీమసేనుడు

(ఏదో మాట్లాడ్డానికి ఉద్రేకంతో లేస్తాడు)

ధర్మనందనుడు

(చెయ్యపట్టుకుని గుంజి, భీముణ్ణి కూచోబెడతాడు)

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) ప్రతీ విషయంలోనూ పుల్లవిరిచినట్టు మాట్లాడీ, కసిపెరిగే పనులు చేసి సుయోధనుణ్ణి భీముడూ, కర్ణుణ్ణి అర్జునుడూ రెచ్చగొడుతున్నారు. దాని కిట్లు కొంపెరు దోహదం చేస్తున్నారు.

విదురుడు

(కుంతితో జనాంతికం) కీలకం అదీ. మన బంగారం మంచిది కాదు.

ధృతరాష్ట్రుడు

విదురా!

విదురుడు

ఆ!

ధృతరాష్ట్రుడు

ఏమి జరుగుతున్నదీ?

విదురుడు

మనవి చేస్తా.

సుయోధనుడు

(లీవిగా సభ అంతా కలయజూచి) అంగా! జబ్బ చరిచి పిలవ్వోయ్!

కర్ణుడు

(జబ్బ చరిచి) ఏమి అర్జునా! కాసుకుంటావా?

అర్జునుడు

(ధర్మనందనుడి కేసి చూసి పూరుకుంటాడు)

భీమసేనుడు

(ఉద్రిక్తుడవుతాడు.)

ధర్మనందనుడు

(భీముణ్ణి అదిమిపెడుతూ కిందికి చూస్తూ వూరుకుంటాడు)

కర్ణుడు

(మళ్ళీ జబ్బ చరిచి, మీసం దువ్వి, సింహనాదం చేసి) అర్జును డొక్కడే కాదు, కౌంతేయులలో మాద్రేయులలో ఎవరయినా సరే రావచ్చు.

సుయోధనుడు

అదీ పద్ధతి.

అర్జునుడు

(మళ్ళీ ధర్మరాజు కేసి చూసి వూరుకుంటాడు)

భీమసేనుడు

(గభీ మని లేచి) పాండవుల ప్రతిష్ఠ— (అర్ధోక్తి)

ధర్మనందనుడు

(భీముణ్ణి మళ్ళీ కూచోబెట్టి) కర్ణుడి ప్రత్యర్థనం మే మంగీకరిస్తున్నాము.

భీమసేనుడు

(అదీ మాట అన్నట్టు వూగిసలాడుతూ తల వూపుతాడు)

ధర్మనందనుడు

అయితే—

భీమసేనుడు

(మళ్ళీ యిదేమి టన్నట్టు ధర్మనందనుడి కేసి తీవ్రంగా చూస్తాడు)

ధర్మనందనుడు

తాతయ్యగారికీ, పెద్దబాబయ్యగారికీ, ధనురాచార్యులవారికీ వొక్క మనవి.

భీమసేనుడు

(అదేమిటి చెప్మా అన్నట్టు ఆలోచనలో పడతాడు)

ధర్మనందనుడు

కర్ణుడూ, అర్జునుడూ మళ్ళీ ద్వంద్వ యుద్ధానికి తలపడా లంటే అందుకు తగిన పొద్దున్నదా?

భీమసేనుడు

(ఇందున్న యుక్తి యేమిటీ అన్నట్టు కిందికి చూస్తూ ఆలోచిస్తాడు)

ధర్మనందనుడు

అందుకు తమరు సెలవు దయచేయిస్తారా?

[భీమసేనుడు 'మంచి యుక్తి సెబాస్' అన్నట్టు తల యెగరవేస్తూ చిటికె వేస్తాడు. సుయోధనుడు ధర్మనందనుణ్ణి యేవగించుకుంటూ దుశ్శాసనుడి కేసి చూస్తాడు. కర్ణుడు 'బతికి పోయావు' అన్నట్టు అర్జునుడి కేసి నిరసనగా చూస్తాడు. కుంతి విదురుడితో జనాంతికంగా 'అమ్మయ్యా' అంటుంది. కృపాచార్యుడు చాలా వుత్సాహం కనపరుస్తాడు. అశ్వత్థామ ద్రోణుడి కేసి చూస్తూ పెదవి విరుస్తాడు. ద్రోణుడు — 'పానకంలో పుడకా' అన్నట్టు కృపాచార్యుడి కేసి తీవ్రంగా చూస్తాడు.]

ధృతరాష్ట్రుడు

ధర్మనందనుని దూరదృష్టి ప్రశంసార్హంగా వున్నది. విదురా!

విదురుడు

పొద్దు చాలదు.

కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) అదీ మాట.

ధృతరాష్ట్రుడు

పెద్దబాబయ్యగారి సెల వేమిట్లో తెలుసుకో.

స్పష్టంగా — అక్షరాలా ప్రకటించేది యేమిటంటే? ఇవాళ, సర్వవిధాలా విజయం అంగరాజుది.

[ప్రేక్షకులలో పెద్దకోలాహలం]

కర్ణుడు

(ఆచార్యు నుద్దేశించి దోసిలి వొగ్గి నమ్రుడవుతాడు)

కుంతీదేవి

(విదురిడితో జనాంతికం) మామయ్యగారి వుద్దేశం సందేహాస్పదంగా లేదూ?

విదురుడు

(కుంతితో జనాంతికం) లేదు. వారు మరొకవిధంగా మాట్లాడడానికి వీలు లేదు. ఆపదవి అల్లాంటిది.

సుయోధనుడు

గురుదేవా! కృతార్థుణ్ణి, మహాత్మా, కృపాచార్యులవారూ! నేను త్రికరణయా విన్నవించుకుంటున్నాను. ఇదంతా తమ చలవ. అయితే, వొకటి చెప్పక తప్పదు. ద్రోణాచార్యులవా రేర్పరిచిన యీ అస్త్రవిద్యాసందర్శనం, కేవలమూ వినోదార్థమున్నూ, అస్మదాదులకు విద్యాభ్యాసంలో శ్రద్ధాసక్తులు వృద్ధికావడానికిన్నీ మాత్రమే వుద్దేశించబడ్డది; కాని తమరు మాత్రం అంగరాజుకి మహోపకారం చేశారు. తాము, అతని కొక మహోపదేశం కూడా చేశారు. ఉపకారంకంటే ఆమహోపదేశమే చాలా విలువ అయినది. ఇలాగు అతని భవిష్యత్ప్రవృత్తి కంతటికీ బాధ్యత వహించవలసిన భారం తమమీదే వుంచుకోడం అందరూ గుర్తించారనే భావిస్తున్నాను. కంఠంలో ప్రాణం వున్నంతకాలమూ తమ మహోపదేశం అంగరాజు రక్తం వుడుకెత్తిస్తూనే వుంటుంది.

అంగరాజా! నాప్రాణమా! నీవిజయం నన్ను ఆనందముగ్ధుణ్ణి చేసింది. ఇక్కడి సహృదయుల కందరికీ నీయెడల వాత్సల్యమున్నూ కలిగించింది. కనక అంగరాజ్యాభిషేకార్ద్రమైన నీశిరస్సు కౌరవసార్వభౌమదంపతులకు పాదపీఠం చేసుకుని వారి సామంతకోటిలో వుత్తమపదవి ఆర్జించుకో. నీ అమందానందబాష్పధారతో తాతయ్యగారి దివ్యపాదాలు అభిషేకించి వారిని నిత్యప్రసన్నులను చేసుకో. నిన్నింతవాణ్ణి చేసిన ద్రోణాచార్యులవారి అనుగ్రహం పూర్వాధికంగా సంపాదించుకో. అన్నిటికీ ముందు లేచి నమ్రుడవై సభా నమస్కారం చెయ్యి.

కర్ణుడు

(లేచి నమ్రుడై సభను వుద్దేశించి అంజలిబంధంతో, శిరసు వంచి నమస్కరిస్తాడు.)

(అందరూ కోలాహలంగా లేస్తారు. గుంపులు గుంపులుగా చేరి తలో విధంగానూ అనుకుంటూ వుంటారు. ఒకచోట విదురుడూ కుంతీ—ఇద్దరే వుంటారు.)

కుంతీదేవి

చాలా గొడవ పెరిగింది.

విదురుడు

ఏమౌతుందో తెలుసా?

కుంతీదేవి

స్పష్టంగా చెప్పలేను. ఏదో మూడుతుంది.

విదురుడు

ఏదో అని సందేహం దేనికూ? సర్వనాశం తప్పదు.

కుంతీదేవి

(దుఃఖిస్తూ) నేను పాపాత్మురాలిని.

విదురుడు

మాట్లాడవద్దు. మనం నిమిత్తమాత్రులం.

కుంతీదేవి

కడుపుచిచ్చు—(అర్ధోక్తి)

విదురుడు

అది యివాళదా?

శతాధికులయిన కోటీశ్వరులుగల కుబేరక్షేత్రము అమెరికాఖండము

అమెరికన్ కోటీశ్వరుల అంతర్యాలు

ఇరాలిల్ ఎ. వార్షాశి అను భారతీయప్రముఖుడు అమెరికన్ కోటీశ్వరులలో నూనెవర్తకుడు రాక్ఫెల్లరు, రాగివర్తకుడు డాడ్జి, ఉక్కువర్తకుడు కార్నీజ్‌లను చూచి చెప్పెడు విషయాలు :

అమెరికాదేశమందలి కోటీశ్వరులతో సాంఘికంగా కలసి తిరిగే భాగ్యం హిందూదేశీయునకు కలుగుట దుస్తరం.

ఏడాదికి పదిలక్షల డాలర్లు మొదలు ఏబదిలక్షలవరకు రాబడిగల ప్రఖ్యాతపురుషులు అమెరికాలో నూటయేబదిమందికి పైగా వున్నారు.

ఆమహనీయులలో ఒకడైన డ్యూపాన్టు మహాశయుడు తన జీవితమును 7 మిలియన్ డాలర్‌కు యిన్‌స్యూర్ చేసివున్నాడు. అంతటి జీవితభీమా ఈమానవప్రపంచములో మరిఒకటి లేదు.

నాకు కోటీశ్వరులలో ప్రథమశ్రేణికి చెందిన—రాక్ఫెల్లరు, డాడ్జి, కార్నీజిలను కలసికొను భాగ్యము లభించినది.

నేను న్యూయార్కులోని కొలంబియా యూనివర్‌సిటీ విద్యార్థిని. అందుచేతనే యీముష్టి వాళ్ళ దేశంలో పుట్టినా కోటీశ్వరులను చూచు అదృష్టమబ్బినది.

రాక్ఫెల్లర్

రాక్ఫెల్లర్లు తండ్రి కొడుకులు యిద్దరు. తండ్రిని సీనియర్ రాక్ఫెల్లరు అని; కుమారుని జూనియర్ అని పిలుస్తారు.

వృద్ధరాక్ఫెల్లరే స్టాండర్డు ఆయిల్‌కంపెనీ యజమాని, నిర్మాత. అతడు ముసలితనమందు సమశీతల ప్రదేశమైన ఫ్లొండాలో నివసించేవాడు. తుదకు అక్కడే పరమపదించాడు.

జాన్ డి. జూనియర్ న్యూయార్కు నివాసగృహము అతిరమ్యమైన ఫిఫ్త్ ఎవెన్యూలో. దానిగేటుమీద పేరులేదు. దయామయుడైన రాక్ఫెల్లరు ఆభవనమునకు ఒకసారి నన్ను మరికొంతమంది వివిధజాతిమనుష్యులను భోజనానికి ఆహ్వానించాడు.

ఆమందిరము ఆకాసమువంటి బ్రహ్మాండసౌధముకాదు. కాని డాబులేని ప్రకాశవంతముగాని రెండతస్థుల మేడమాత్రమే. ఆ కోటీశ్వరుని కొంప ఎంతోగొప్పగా వుంటుందనుకున్న నా వూహలు చిన్నపిల్లకాయ వూహ అయినది.

ఇల్లుచూసి యిల్లాలిని చూడమన్నారు. ఆకోటీశ్వరునిభార్య వీధిగుమ్మంలోనే మమ్ము కలసికొని స్వాగత మొసగినది.

ఆమె పొడుగైనమనిషి. రోమన్ యింటియజమానురాలునకుండే గంభీరతతోకూడిన గొప్పతనములు ఆమెలో ప్రస్ఫుటమగుచుండినవి.

వీధిగుమ్మందాటి లోపలి సావిడిలోనికివెళ్ళాం. అక్కడ మమ్ములను ఒక గూఢచారిణి పరిశీలించి మా ఆహ్వానపత్రములు సరిచూచి లోనికి పోనిచ్చింది. ఆగూఢచారిణి ప్రపంచంలోని కల్లా పెద్దబ్యాంకు అయిన ఛేజ్ నేషనల్ బ్యాంకు ప్రెసిడెంటు సోదరి.

రాక్ఫెల్లర్లు నిరాడంబరజీవులు. జూనియర్ రాక్ఫెల్లరు చతురుడు. బుద్ధికుశలతకలవాడు. భోజనాల సమయంలో అతనిధోరణిని పట్టి అతడు వివేకవంతుడని పోల్చుకోవచ్చు. పురాతనపుమనిషి.

దురలవాటులకు దూరుడు. మద్యపానంచేయడు. చుట్టా, సిగరెట్టు ముట్టడు. కాని 1932 లో మద్యపాన నిషేధానికి వ్యతిరేకుడు. అతని బావగారైన ఆల్‌డ్రిచ్ ఛ్యాష్ నేషనల్ బ్యాంక్ అధ్యక్షుడు. అతని ప్రక్కనకూచుని సిగరెట్టును గుప్పుగుప్పున పూదేస్తున్నాడు. ఆరాక్‌ఫెల్లరు కుమారులుకూడా అక్కడ వున్నారు. మూడుమూర్తులా ఆ తండ్రి కొడుకులే వారు.

హిందూదేశములో ఎంతమంది ప్రజలున్నారో అన్ని డాలర్లు తమకు ఉన్నా వారు ఆడంబరముగా వుండలేదు. తండ్రి వారి అందరకు విశ్వవిద్యాలయాలలో చదువు చెప్పించాడు. పెండ్లిండ్లు చేసాడు. తన కంపెనీలో కొన్నికొన్ని స్థలములకు వారిని డైరెక్టరులుగా నియమించాడు. వారికి పనిలో తగిన శిక్షణ యిచ్చాడు. ఆ కుమారులలో నెల్‌సన్ అనువాడు ఎలెక్ట్రిక్ లిఫ్టు ఆపరేటరు బాయ్‌గా పనిచేసి సంపాదించి తండ్రి పంపే 100 డాలర్ కుతోడు చేసుకునేవాడు- కాలేజీ విద్యార్థిగా నున్న సమయంలో.

కుర్రకారునకు బుద్ధిచెప్పేవిధం అదే. రాక్‌ఫెల్లరు సంతానం మూడవతరగతిలో ప్రయాణంచేస్తారు. ప్రపంచంఅంతా చుట్టేసమయంలో వాళ్లు యిండియాకూడా చూశారు.

ఆ కుమారులలో ఒకడు అప్పుడే మనుగుడుపులు కుడిచి బెర్ముడాస్‌నుంచి మరలివచ్చాడు భార్యతోకూడా.

ఆ నూతనవధువు నిరాడంబరురాలు. తేజోవంతురాలు. ఆమెకూడా మాతో విందు ఆరగించినది. ఆమెకు వస్త్ర వాహనాలు ఏమీలేవు. ముక్కులకు చెవులకు మెడలోను కాళ్ళకు బంగారం వెండి వస్తువులు తగిలించుకునే భారత నారీమణులకు-ఆమె ఆదర్శప్రాయురాలు కాతగ్గ మనిషి- వారు సొంతకారులో తిరగరు. టాక్సీలోనే ప్రయాణాలు సాగిస్తారు. దానివల్ల యీర్ష్యాళువులకన్నులు వారిమీద పడవు. అంతేగాదు అందులో భద్రత కూడావుంది.

దానివల్ల దారులు కాసే వారలనుండి, దొంగలబారినుండి సులభంగా తప్పించుకోవచ్చు. జూనియర్ రాక్‌ఫెల్లరుకూడా ప్రజల ఆకర్షణనుండి దూరంగా వుండటానికి ప్రయత్నిస్తూ వుంటాడు డాబుగా ప్రజలను ఆకర్షించుట అతని మతముకాదు. అతడు కారులోనికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అతి జాగ్రత్తగా వుంటాడు. ప్రచ్ఛన్న వేషధారులచే సంరక్షింపబడుతూ వుంటాడు.

మూడు మిలియనుల డాలరులను వెచ్చించి అంతర్జాతీయ విద్యార్థులకుగాను నిర్మించిన అంతర్జాతీయభవనందగ్గరకు వచ్చేసమయంలో తనకారును అవతలవీధిలో దిగివస్తాడు. ప్రజలను ఆకర్షించుటకెంతమాత్రం యియ్యకొనడు. కోటీశ్వరుడైనందుకు కులుకుటమాని యాతనాభారం నెత్తిని పడినందుకు విచారిస్తాడు.

ఒకసారి జాన్ డి. జూనియర్ నన్ను కుశలప్రశ్నలడిగాడు.

హిందూదేశంలో నేనొక న్యాయవాదినన్నాను. నాకు ఆదాయమునుగూర్చు విషయములందాశక్తి అనిన్నీ, త్వరితంగా ధనమార్జించే మార్గాలు కొన్ని నేర్చుకుందామనిన్నీ అమెరికాకు వచ్చానన్నాను.

ధనమార్జించటానికి దగ్గిర మార్గమా! అని ఆశ్చర్యపడ్డాడు. ఆలాంటిది ఏదేనావుంటే నాకు చెప్పమని అతడే నన్ను ప్రాధేయపడ్డాడు.

డబ్బున్న తల్లిదండ్రులకు పుట్టడం- లేకపోతే స్టాక్‌మార్కట్‌లో టంచనగా ఊహించి వ్యవహరించడం దగ్గిరమార్గా' లన్నాను.

ఆమాటలకు పొట్ట బద్దలయ్యేటట్టు నవ్వాడు.

తరువాత అతనివద్ద శెలవుతీసుకుని వస్తూవుంటే తాళపుగొలుసు బహుమానంగా యిచ్చాడు జ్ఞాపకార్థం. అందులో ఒక ఏనుగు, గుర్రపునాడా——మన వెండి చింతకాయలా—వేలాడుతున్నాయి. అతడు జ్ఞాపకార్థం బాలురకు ధనము కూడా యిచ్చేవాడు.

మేము విందుకుడిచి, వస్తూఉన్నాం. మమ్ములను సాగనంపడానికి

కూడా వస్తున్నారు వారిలో ఒకరు.

ఆసమయంలో రాక్ ఫెల్లరు కొడుకులలో ఒకడు నన్ను మాటలోనికి దింపాడు.

మీదేశం వేదాంతులదేశం కాదా? అన్నాడు.

‘ఆ! అవును. మీదేశంలో కావలసినంత ధనంవుంది, జీవితసౌఖ్యం వుంది మేము దరిద్రంచేత వేదాంతులము. వేదాంతుల మగుటచేత హీనులము అయినాము. మన స్థానాలు మార్చుకోడానికి నేను ఎప్పుడైనా సంసిద్ధుడనుగానే వున్నాను’ అని సమాధానం యిచ్చాను.

అందరు కోటీశ్వరులకులాగునే రాక్ ఫెల్లర్లకు పల్లెటిపట్టునగృహాలున్నాయి. వారికుటుంబాలు ఆ యిండ్లలోనే నివశిస్తారు. నగరాంతర్భాగమందుండు యిళ్లు అతిథులను సత్కరించుటకు ఉపయోగింతురు.

ఇవికాక వేసంగిలో వుండడానికి విలాసమందిరములుకూడ కలవు. అవి ఫ్రాంసులోకాని, ఫ్లారిడా నగరమందుకాని ఉండును.

ఒకరోజున జర్మన్ స్నేహితునితో కలసి న్యూయార్కు పరిసరప్రాంతమందున్న టారీటవున్ సమీపమందలి రాక్ ఫెల్లరు వనగృహమునకు వెళ్ళినాను.

ఆయిల్లు వెయ్యిఎకరములతోటలోవున్నది. లేళ్లు పరుగులు పెడుతున్నాయి దారులవెంబడిని. దారులమధ్య అక్కడక్కడ హద్దుమీరినచో శిక్షింపబడుదురను నోటీసుబోర్డులు పాతబడియున్నవి. ఆ పెద్ద తోటలో ఎవరిని కలుసుకోకుండా తెగనడిపాం కారును. అది నిర్జనమైన తోటలా కనుపించింది.

కొంతదూరం వెళ్ళేసరికి గొలుసులు తెంపుకుని మీదబడేటంత రాద్ధాంతంచేసింది ఒక వేటకుక్క—కట్టబడివున్నది—

తుట్టతుదకు రాక్ ఫెల్లరు గృహం చేరుకున్నాం. బంగారపు యిటుకలతోను చలువరాళ్ళతోను, రత్నఖచితద్వారాలతోను వుంటుందనుకున్న భవనం పూరిగుడిసె ప్రత్యక్షమైంది నాముందు. నాకళ్ళు నేను నమ్మలేదు.

మన మహారాజులవలె అమెరికా కోటీశ్వరులు చలవరాతిభవనములమీద, ఏనుగులమీద లక్షలకొలది ధనము వ్యయముచేయరు. వారు చిన్నచిన్న సాధారణగృహములను నిర్మించుకొంటారు. వారి కుటుంబములు ఒక్కొకరు ఒక్కొక చిన్నయిల్లు వుపయోగించుకొంటారు. వారు ఒకరినొకరు ప్రతిదినం కలుసుకుంటారు. మన యిండ్లలో వున్నట్టు గృహకల్లోలాలు ఆయిండ్లలో వుండటానికి అవకాశంలేదు. అందరూ ఒక చోటవున్నా ఎవరి మర్గానికి వారే సేనాపతులు.

రాక్ ఫెల్లరుకూడా అందరివలెనే అధర్మమార్గమువలనే ధనము కూడబెట్టినాడు. ఆవిషయం మిస్ ఇండా టార్ బెల్ వ్రాసిన స్టాండర్డు ఆయిల్ కంపెనీ చరిత్రములో స్పష్టీకరించింది.

ధరతగ్గింపులకోసం, ధర నిర్ణయాలకోసం యుద్ధాలు జరిగేవి. కోర్టులు, వ్యవహారాలు తప్పాయి కాదు. అవి రోజులమహిమ.

రాక్ ఫెల్లరు ఆవ్యాపారంలో ఐక్యం అయిపోయాడు. అదృష్టదేవతను ఎదుర్కొని తనవశంచేసుకొన్నాడు.

అతడు జాతి ఔన్నత్యానికి భాగస్వామి అయినాడు. అతడు కష్టపడి సముపార్జించిన ధనం శక్తికొలది దానంచేసాడు. విద్యాసంస్థల నెన్నింటినో నెలకొల్పాడు. ఆసంస్థలు చైనాలోను, అరేబియాలోను అవిద్యను జయించకలిగాయి. పనామా, బ్రేజిల్ లోని మలేరియా నివారణకు అంతులేని ధనము యిచ్చాడు ఇండియాలో బోదకాళ్ళ నివారణకు కలరా నివారణకు తగిన సహాయంచేసాడు అన్యాయమార్గాల నార్జించినా మంచి మార్గాలలో ఉపయోగించాడు. 1922 నాటికి 500 మిలియన్ డాలర్లు ధర్మకార్యాలకు వెచ్చించాడు.

1929 లో సంభవించిన వాల్ స్ట్రీటు ధనభంగంనాటికి అతను 12 మిలియన్ డాలర్లు దానాలుగా యిచ్చినాడు.

ధావంతుని చూడాలని తలచాం కాని అతడు అప్పుడు వూరిలో లేడు.

కార్నేజీలు మాకు తమ భవనం చూపిరి రెండవ అంతస్తులో తిరుగు చుండగా ఇవతాళించు ఆశీతాకాలంలో గులాబీపువ్వులు కనుపించినవి. ఆచలికాలంలో అక్కడ గులాబీపువ్వులు కనుపించుట ఆశ్చర్యమైనది—

ముసలి యాండ్రూ కారనేజి నిరాడంబరుడు అని చెపుతారు. కాని నాకంటికి అందరి కోటీశ్వరులలోను దూబరామనిషిగా కనుపించాడు.

అతనికి శాంతిఅన్నా, పుస్తక భాండాగారములన్నా ఆనందం. ప్రజలకు కోట్లకొద్ది ధనము దానం చేస్తాడు. కారనేజీ ఫౌండేషన్ నిధికి 36 మిలియన్ డాలరులు యిచ్చినాడు.

మొత్తంమీద ఆకోటీశ్వరులు సాలునకు రెండు బిలియన్ డాలరులు ధర్మకార్యాలకు కర్చుచేస్తారని తెలియుచున్నది.

అందుకునే ఆదేశమంత అభివృద్ధి పొందింది—కార్నేజీలు మాకందరకు జ్ఞాపకార్థం ఒక్కొక పర్సు యిచ్చారు. నేను ఆపర్సు ఆతురతతో అందుకుని ఆశతో విప్పి చూచా. అది ఖాళీపర్సు.

'డబ్బుయివ్వండి పర్సుకిపైన వేస్తాను అన్నాను చలోక్తిగా. వారందరు వట్టిపర్సు యిచ్చినం

భోగి సంక్రాంతి

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి

అందాల పుట్టిండ్ల కాంధ్రభూములకు
తీయని రాగాల తెనుగుసీమలకు.

* * *

తెనుగువాకిండ్లలో దీపాలు పెట్టి
తెనుగువీధుల సౌరు తీరుగా దిద్ది

పిలిచివత్తము రారె పిన్ని సంక్రాంతిని
తోడితెత్తము రారె తోడి సంక్రాంతిని.

* * *

వచ్చింది వచ్చింది బాల సంక్రాంతి
వచ్చింది వచ్చింది వన్నె సంక్రాంతి

చెఱుకుతోటల పాలు చిక్కగా చిలికి
పంటరాసుల నెల్ల పాటించి కొలిచి
పున్నాగపూలతో పొంగళ్ళుపెట్టి
గుమ్మడిపండ్లతో కొలుపు సాగించి

వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి
వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి.

* * *

చక్కదనాల యనంటి స్తంభాలు నిలిపి
పచ్చి పొన్నాకులను పందిళ్ళు కప్పి
తీరుతీరుగ పూల తోరణాల్ గట్టి
మొగిలిపూరేకులను మొగసాల దిద్ది

పిలిచివత్తము రారె పిన్ని సంక్రాంతిని
తోడితెత్తము రారె తోడ సంక్రాంతిని.

* * *

చందనంబును క్రొత్త బిందెలను నింపి
పసుపు కుంకుమ ఆకు పళ్ళాల పోసి
పొన్నాకు కంచాల భోగంబుపెట్టి
ఆనందగీతలో హారతిని బట్టి

పిలిచివత్తము రారె పిన్ని సంక్రాంతిని
తోడితెత్తము రారె చేడె సంక్రాంతిని.

* * *

రావేమె రావేమె రతనాలబొమ్మ
రావేమె రావేమె రాగాలరెమ్మ
పాలు పొంగింతాము పందిళ్ళక్రింద
పాయసం బింటింట పంచివత్తాము

వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి
వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి.

* * *

పసుపుగుమ్మడితేనె పాదాలు కడిగి
గోరంటరసముతో పారాణిఁ బూసి
ఆరామపుష్పాల హారంబు వేసి
త్యాగరాజపదాల స్వాగతం బిచ్చి

పిలిచివత్తము రారె పిన్ని సంక్రాంతిని
కలిసివత్తము రారె కన్నె సంక్రాంతిని

కళ్యాణమాల ఈ కాంత సంక్రాంతి
భోగాలబాల ఈ భోగి సంక్రాంతి.

—రాయప్రోలు సుబ్బారావు.

డుకు హేళనచేస్తున్నానని ఖిన్నులైనారు.

వారు కోటీశ్వరులైనా కొంచమైనా గర్వములేక విద్యార్థులతో యింత సరసముగా సల్లాపములాడుచుండగా పంచపట్టణేశులైన మనరాజులకు, జమీందారులకు యింతగర్వ మెందునో

ఆ కోటీశ్వరులు వివాహావిషయాల్లోకూడా ఆదర్శప్రాయులే. ఇంతడబ్బు వుందికదా అని దమ్మిడీలులేకపోయినా పెద్దబిరుదు తో కలుగల జమీందారుల బిడ్డలను చేసుకొనుటకు ప్రాకులాడలేదు. రాక్‌ఫెల్లరు అలాంటి జమీలనే కొనగలరు తలిస్తే. కాని వారి కా కోరిక నేటివరకులేదు.

ఆకుటుంబీకులు ఎప్పుడును తమతో సాంఘికంగా సమానస్థాయిలోవుండు సాధారణవనితలనే వివాహమాడినారు.

నేను ఆరాక్‌ఫెల్లర్లను యిండియా ఆహ్వానించినాను. ఇండియావస్తే వూరేగడానికి పనికివచ్చే ఏనుగులనే యిస్తానన్నాను నవ్వుతూ.

అందరు నవ్వారు. అంతలో నామిత్రు డొకడు నాచెవిలో యీలావూదాడు:కొంతమందివద్ద ధనం వుండడం శాసనాకారమైనా మన రాక్‌ఫెల్లర్లవద్ద ధనముండడం ప్రపంచమునకు అదృష్టము, వరప్రసాదమును అన్నాడు.

డాడ్జీలు

రెండవవారు న్యూయార్కు చెంత 600 వేల ఎకరములకు సర్వాధికారులు. హడ్సనును ఆనుకుని న్యూయార్కు సమీపంగా వుంది. డాడ్జి సోదరులు దానికి కామందులు. వారు యిద్దరు కవల బిడ్డలు. ప్రపంచమంతటను గనులున్నవి. టర్కీలోను, అరేబియాలోను వారు కాలేజీలను స్థాపించారు. న్యూయార్కులోని కొలంబియా విశ్వవిద్యాలయమువారి ప్రసాదమే.

ఆసోదరులలో ఒకడు సిరియాలోని బ్యూరూత్‌నందలి అమెరికా కాలేజీకి అధ్యక్షుడు. ఆడాడ్జి సోదరులలో ఒకనిభార్య అంతర్జాతీయమైన వడ్డీ వ్యాపారముగల మార్గన్‌ను కుమార్తె. ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు కష్టకాలంలో అతని వద్ద బదులుతీసుకొనుట అలవాటు. పూర్వం అమెరికా అధ్యక్షుడైన విల్‌సన్ ఆడాడ్జి సోదరుల కుటుంబస్నేహితుడు. ఆనగరంవస్తే వారి యింటనే వుండేవాడు.

ప్రపంచమహా సంగ్రామశాంతి కారణమైన విల్‌సన్ పదునాలుగు షరతులు ఆగృహంలోనే కూచుని ఆలోచించినాడు. ఆగది వారి యింటికి వెళ్ళినప్పుడు చూపారు మాకు.

రాక్‌ఫెల్లరు వనగృహంలాగే డాడ్జి సోదరులకుకూడా ఆరామ మందిరము లున్నవి. ఆవనంలో అనేకమైన చిన్నచిన్న గృహము లున్నవి. వాటిలో ఒకదానియందు వారితల్లి, తక్కినవాటియందు సోదరులు వసింతురు.

అమెరికాదేశీయులు హిందువులకుమల్లే ఆధ్యాత్మికప్రపంచములో సౌధములు నిర్మించరు. అవి గాలిలోని మేడలని వారి భావన. అంతేకాదు ఆకాశాలనంటే మేడలుకూడా కట్టరు యీ కోటీశ్వరులు.

డాడ్జిసోదరుల కుటుంబీకులు చాలా సరదా అయినవారు. మేము ఉద్యానవనం వెంబడిని శెలవు తీసుకుంటోవుంటే ఆడాడ్జి కుమార్తె పువ్వులుకోసి మాకోటులలో పెట్టుకొమ్మని బలవంతపెట్టింది.

కార్నెజీలు

ఉక్కురాజు యాన్ డ్రూకార్నెజి అపార ధనమార్జించి చనిపోయాడు. అతనిభార్య దేశమంతటా ధర్మవైద్యశాలలను నెలకొల్పింది. న్యూయార్కులోని కోటీశ్వరుల ఎవెన్యూలోకూడ వైద్యశాల నెలకొల్పింది.

బయటకేమీ డాబుగా లేకపోయినా ఆయిల్లు తివాసీలతో కప్పబడిన మెట్లతో చాలా సొగసుగా వుంటుంది.

కార్‌నేజి స్కాచివాడు. అతడు స్వదేశంలో ఒక కోట కట్టినాడు.

అతిథులను ఆహ్వానించే గదిలో కార్నెజి యొక్క బొమ్మవున్నది.

అందు అతని ముసలిగెడ్డం పొట్టిగా కత్తిరింపబడివుంది. ప్రక్కను భార్యా, కుమారుడు, కూతురు, అల్లుడు వున్నారు. కార్నెజి స్టీల్ ట్రస్టునకు కార్యదర్శిగా నున్న చార్లెస్‌స్క్వాబ్. కారెనేజికి కుడిభుజము. మేము ఆ అపురూప మే

దీక్షాకంకణాలంకృతి

రచయిత: బలిజేపల్లి లక్ష్మీకాంతకవి

౧

మీ సైదోడులు వంగదేశమున నెమ్మిన్ మాతృదేశైకదీ
క్షాసంకల్పమునన్ నిరంకుశ ముత్సాహంబుతో దాస్యవి
ద్యాసన్యాస మొనర్చువార్తలు దిగంతక్రాంతమై మ్రోయ ఛీ
ఛీ సిగ్గేటికి లేదొ! ఆంధ్రయువకో జీవంబు నిర్జీవమో.

౨

అతిదీనంబయి నీచదాస్య నిగళవ్యాబద్ధమై దుర్భర
స్థితిమై వాడి కృశించు దేశజనయిత్రీదుఃఖమున్ గాంచి ది
క్తతు లాక్రందనమాచరింప వినరాదా మీకు? గంపంతి సం
తతియున్నందుకు దాస్యమోచనమె లేదా యెందుకీజన్మముల్ ?

౩

నిరవద్యుండు గుణాఢ్యుఁడొక్కసుతుఁడేనిన్ జాలు గర్భాతురుల్
కొఱగాముల్ పదికోటు లేమిటికి రక్షోయక్షయోధాళిఁ బె
క్కుఱఁ జక్కాడి యనన్యసంభవసుధాకుంభంబు సాధించి త
ద్గరుఁడుం డొక్కఁడ కాదె తీర్చె జననీదాస్యం బనాలస్యతన్.

౪

నడుపంగాఁగల నాయకోత్తములు సన్యస్తాఖిలోద్యోగులై
నడుముల్ గట్టి స్వదేశసేవకయి ప్రాణంబైన నర్పింప మున్
నడువన్ మీయెడ జీవమే నిలిచియున్నన్ నేఁడె మీదాస్యపుం
బడులన్ బాడొనరించి దేశహితసేవాదీక్షకై నిల్వరే.

౫

కడుపుంగూటికిఁ గాకులై యలఁతులన్ గాలో త్రిజీవించు నీ
బడుగుంజీవన మాసఁజేసి భువనప్రఖ్యాతమౌ జాతి యీ
అడివోఁజూతురె? కూడులేకవడిలన్ ప్రాణంబు గోల్పోవు? మీ
నడమంత్రపుఁబరీక్షలన్ జనువకున్నన్ జచ్చిరా పూర్వికుల్.

౬

ఏనాఁడీ మిడిమేలపుంజనువుకై యీజాతి యాశించెనో
ఆనాఁడే నశియించె వృత్తులును శిష్టాచారముల్ ధర్మముల్
జ్ఞానంబైనది యేదొయైన దిఁకనైనన్ లేచి నేఁడే శుచి
స్నానంబుం బొనరించి కైకొనుఁడు దీక్షాకంకణాలంకృతిన్.

—ఆంధ్రవాణి.

ఆంధ్ర కేసరి ప్రకాశంపంతులు ఆంధ్ర దేశానికి కిరీటంలేని రాజు

గుండుదెబ్బకు గుండెఇచ్చిన గండు ప్రకాశం

జమీన్ రైతు జనబాంధవుడు. ఎస్టేట్ ల్యాండు యాక్టుకమిటీ అధ్యక్షుడుగా అతడు తయారుచేసిన నివేదిక మద్రాసురాష్ట్రపు కాంగ్రెస్ మంత్రుల చరిత్రలో మరువరానిది కాగలదు.

భారత జనయిత్రి పదాం
భోరుహ సేవామృతానుభూతిసదానం
దారూఢ మతి ప్రకాశము
పేరది తిరుమంత్ర మాంధ్ర వీర
కుమారా!

—బి. యస్. మూర్తి.

అది ప్రకాశంపంతులు ప్రాక్టీసుచేసే రోజులలో ఒకనాటి దృశ్యము.

అతను ముగ్గురు న్యాయమూర్తుల ఎదుట ఒక కేసులో ఆర్గ్యుమెంటులు చెప్పతూవుండెను. కొంతసేపు ఆర్గ్యుమెంటులు అయిన తరవాత ఆముగ్గురు న్యాయమూర్తులలో ఒకడు 'ప్రకాశం! నీ ఆర్గ్యుమెంటులో నాకేమీ పాయింటు కనిపించటంలేదు' అన్నాడు.

అప్పుడు ప్రకాశం తొణక్కుండా బెణక్కుండా 'అట్టి సందర్భంలో నా ఆర్గ్యుమెంటులు మిగతా ఇద్దరు న్యాయమూర్తులకే నివేదించుకుంటాను.' అన్నాడు.

ఆప్రత్యుత్తరంలోనే ప్రకాశం స్వభావం అంతా ఇమిడివుంది. నిర్భయం-ఒక్క నిర్భయమే కాదు. అందులో చొరవవుంది. ఆచొరవలో మొండితనం వుంది. ఆమొండితనంలో ప్రజాహిత చింతవుంది.

హృదయం సమ్మతిస్తే ఆరుమూడు అయినా, మూడు ఆరుఅయినా అతను ఆపనిని చేసితీరతాడు. లోకం ఏమనుకుంటుందో అనే సంకోచం అతనికి లేదు—పెద్దలు ఏమనుకుంటారో అనే మొగమోటమూ అతనికి లేదు.

అతనిది ఒక్క సాహసమే కాదు—ఆసాహాసములో సగమునకుపైగా తెంపరితనమున్నది. ఒకపని మంచిదని తలచి దానికి పూనుకున్నాడా అతను ఇంక ఇతరులు ఏమిచెప్పినా వినిపించుకోడు.

ఈవిషయానికి అతడు ఇటీవల ఎస్టేట్ ల్యాండు యాక్టు కమిటీ అధ్యక్షుడుగా చేసిన సిఫారసులు- అందుకు అనుబంధముగా ప్రచురించిన జమీందారీరైతు చిత్తుచట్టము నిదర్శనం ఈయగలవు.

అతడు సంకల్పించిన జమీందారీ రైతు బిల్లునుగురించి ప్రజామిత్ర సంపాదకీయం వ్రాస్తూ ప్రకాశంపంతులు జమీందారీ రైతులకు దీపంపెట్టి మ్రొక్కతగిన దివ్యుడైనాడన్నది.

ఈసందర్భంలో ఆదివ్యుని జీవితకథ కొంత తెలుసుకుందాము.

ఆతేజోరాశిబాల్యము నేటి నియంతల బాల్యమువలె కళావిహీనమైనదే బాలభాస్కరుని కాంతి జలధరముల చాటున మ్రగ్గినట్టు ప్రకాశం బాల్యం దరిద్రమనే కారుమబ్బుల వెనుక మ్రగ్గిపోయింది.

1873-వ సంవత్సరమున గుంటూరు మండలమందలి వంగోలు తాలూకాలోని వల్లూరు గ్రామమందు ఉద్భవించినాడు అతడు.

తల్లిదండ్రులు సామాన్య నియోగి దంపతులు.

ముసోలినీ, హిట్లరు, స్టాలిన్ మహాశయులవలెనే ప్రకాశంకూడా పూరికొంపలోనే ప్రపంచకాంతిని తిలకించినాడు.

స్టాలిన్, కెమల్ పాషా తండ్రులవలెనే మన కథానాయకుని తండ్రికూడా అతనికి శైశవావస్థ వీడకుండానే పరమపదించాడు.

అతని భారమాతనితల్లిపైబడినది. ధీశాలినియగు అతనితల్లి నియంతల తల్లులవలె కష్టించి నీళ్ళబిందెలుమోసి తన కడుపుకట్టుకుని పుత్రులకు విద్యాబుద్ధులు చెప్పించింది.

ఆమె ఓర్పు ధీరత్వము పూజనీయములు. చదువుకునే రోజులలో ప్రకాశం చాలా అల్లరిగా తిరిగేవాడని వదంతి. కాని అవిఅన్నియు స్వేచ్ఛాభావఫలితాలే అంటాను.

విద్యాభ్యాసదినములలో నాటకాలు వేసేవాడు. పోలెండు రాజ్యనిర్మాత మార్షల్ పిల్సుడిస్కీవలె యితడుకూడా స్త్రీపాత్రలు ధరించేవాడు. ఆపాత్రలను అతినిపుణతతో నిర్వహించి ప్రశంసాపాత్రుడైనాడు.

ఆ నాటకాలఖ్యాతివల్లనే వంగోలు నుండి ముకాం రాజమండ్రీకి [illegible]ంద.

దానికి కారకుడు అతని గురువైన సామినేని హనుమంతరావు.

అక్కడ నాటకాలువేసి విద్య నేర్చుకున్నాడు.

ఎంత అల్లరిపిల్లకాయో విద్యలో అంత చురుకైనవాడు. ఆచురుకుతనం కొంతమంది అధ్యాపకులకు పచ్చివెలగకాయి అయ్యేది.

1889-వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పరీక్ష అయినాడు.

మరుచటివత్సరం ఆర్ట్సు కళాశాలలో యఫ్.ఏ పరీక్షకు చదివెను.

గవర్నరుపదవికూడా అలంకరించిన రెడ్డినాయుడు మొదలైనవారు అతని సహపాఠకులు.

1893-లో ఫస్టుగ్రేడుప్లీడరు పరీక్షకు చదివి ప్యాసయినాడు.

1895-లో బి.ఏకు చదివి ఒకపార్టు నందుత్తీర్ణుడై దానితో విరమించుకొన్నాడు.

1894-మొదలు 1904 వరకు రాజమహేంద్రవరములో వకీలుగా ప్రాక్టీసు చేసినాడు.

ఆరోజులలో అతని స్వతంత్రభావములు మిన్ను ముట్టినవి. జిల్లామునసబుని కూడా తనశక్తిచే తీర్చిదిద్ద నెంచినాడు.

జిల్లామునసబు అవలంబించు లంచగొండితనమంటే ప్రకాశానికి మంట పుట్టింది. కాని కొంతమంది వృద్ధులు— అంటే లంచాలిచ్చి కేసులు గెలిపించుకునే ప్లీడర్లు అతనిని మందలించి ప్రాధేయపడి అతని కోపానలం చల్లార్చారు.

1903-లో రాజమండ్రి మునిసిపల్ చైరుమన్ పదవిని పొందినాడు- పూర్వం నుంచీ వేళ్ళుపాతుకునివున్న సభ్యులను ఓడించి.

ధైర్యమే ధనముగా నెంచి 1904లో యింగ్లండువెళ్ళి బారిష్టరు అయినాడు. అతని ధైర్యదేవతయే మిత్రులరూపమున సహాయంచేసింది. వారిలో ముఖ్యులు కంచుమర్తి రామచంద్రరావు, మాగంటి సీతయ్య, లక్ష్మణదాసు, గున్నేశ్వరావు మొదలైనవారు.

• రాజమండ్రీలోవుండేటప్పుడే అతనికి కాంగ్రెసుకిరణము సోకిందికాని విదేశమునుండి తిరిగివచ్చినవెనుక సనాతనులు అతనిపైచూపిన అనాదరణకు కాంగ్రెసుపై గాఢమైన అభిమానము జనించినది.

1907-లో బారిష్టరై తిరిగివచ్చి మదరాసులో ప్రాక్టీసు మొదలుపెట్టినాడు. తారాజువ్వవలె అచిరకాలమందే అతని ప్రభావము అభ్రంకషమైనది. చేతినిండా పుష్కలంగా ధనము కనుపించినది.

ధనమున్నచో అధ్యక్షపదవులకేమి కొరత? దానికితోడు చతురుడు—బంగారమునకు తావి అబ్బినది—కాగా మదరాసు బారునకు అధ్యక్షుడైనాడు.

నాయకులందరిలోనూ వుండే విమర్శనాశక్తి అతనియందూ ప్రస్ఫుటమైనది. కాగా అతనిని లాజర్నలులకు సంపాదకునిగా చేసిరి. ప్రకాశంపంతులు జడ్జీలనుకూడా నిర్భయంగా విమర్శించేవాడు ఫీజు బాగాపుచ్చుకునేవాడు. శ్రద్ధగా పనిచేసేవాడు.

గున్నేశ్వరావుమీదపెట్టిన రాజమండ్రీ కన్ఫరెన్సుకేసులో గున్నేశ్వరావు తరపున వాదించాడు. విజయంపొందాడు.

అతడు కోర్టులో నల్లటిసూటుతోను బొచ్చుటోపీతోను ప్రత్యక్షమైతే అందరకీ భయోత్పాతం కలిగించేది. ఆయన వెనుక సిల్కుసూటుతో సాంబమూర్తి సాక్షాత్కరించేవాడు.

వారిద్దరు నేడు కర్మసన్యాసులైనారు. అంగవస్త్రంతో ఒకరు. చిరుగుల చొక్కాతో, కాలువావలైవాటు వేసుకొని ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తారు.

1919-లో మహానందిలో జరిగిన ఆంధ్రరాష్ట్రీయ మహాసభకు అధ్యక్షుడు ప్రకాశం. అప్పటినుండి ఆందోళన జరిగేరాష్ట్రం యింకా ఇప్పటికీ గగనకుసుమమైయ్యే వున్నది.

మాంటేగు ఛెలమస్ఫర్డు సంస్కరణములను ప్రతిఘటించినవారిలో ప్రకాశం పంతులు ఒకడు. అతని ఉపన్యాసము సింహగర్జనవలె ప్రతిధ్వనిస్తుంది. ప్రతి అక్షరం తూచి వేస్తాడు. పట్టాభివలె హాస్యలో దింపడు. చేయవలసినపని ఖండితంగా ముక్తసరిగా చెప్పి ప్రజలను ఉద్రేకులనుచేసి వారిచే ఆపనిచేయిస్తాడు.

రాజాజీని పార్టీలీడరుగా ఎన్నుకొనిన గోజున బీచిలో పెద్దసభజరిగింది. శాసనసభ్యులనందరను తోలుబొమ్మలాటలో తెరమీదచూపి దింపినట్టు సత్యమూర్తి రాజాజీలు చూపుతున్నారు.

ఆంధ్రనాయకుడైన ప్రకాశం ప్రధానమంత్రియగుటకు తనకున్నహక్కులను రాజాజీకి యిచ్చినట్లు ఆంధ్రయువకులలో పొక్కి 'ప్రకాశం, ప్రకాశం' అని గోలచేసారు.

[illegible] లో లేచి తనసహజ గాంభీర్యమైన కంఠంతో "ఎవరు నాయకుడైనా [illegible] కలిసి చేయవలసినదే" అన్నాడు. అట్లాగే చేస్తునాడు. ఆ వివేకము రాజాజీలోకూడా వుంటే ఆంధ్రలోకమింతగా కలతచెందకపోవును. అట్టి ప్రజలను ఒప్పించి చేయించగలశక్తి కేసరికే తగినది.

1920-లో సహాయనిరాకరణోద్యములో దక్షిణాదిని ముందడుగువేసినవాడు ప్రకాశంపంతులే. మోపలా తిరుగుబాటులో పోలీసు దౌర్జన్యాలను విమర్శించిన శూరుడు ప్రకాశం. ఆ ప్రాంతీయులు నేటికి అతనియందు అమిత భక్తి కలిగి ఉన్నారు.

హిందూ తెలుగువాళ్ళపై మాపేసవతి తల్లి ప్రేమను చాలాకాలంక్రితమే ఆకళించుకున్నాడు ప్రకాశంపంతులు.

కాగా తెలుగువారికనే ఒక యింగ్లీషు పత్రిక వుండి ఆంధ్రాభ్యుదయము తద్వారా భారతాభ్యుదయమునకు పాటుపడాలని తలచాడు. తనశక్తిసంపదలు దానికి ధారపోశాడు. [illegible] ప్రభు

త్వపు హుకుంకు గురియై మూయబడింది. తిరిగి వర్ధిల్లలేదు.

1921 నవంబరు నెలలో ప్రథమసంచిక వెలువడింది. అవి ఆరోజులలో ఆంధ్రదేశమున అఖండసంచలనము కలిగించింది,

అదే సంవత్సరములో ప్రకాశంపంతులు నాయకత్వముక్రింద పన్నులు చెల్లింప నిరాకరించిరి గుంటూరు మండలంలో. ఆవిప్లవమునకు భీతిచెంది అక్కడ జిల్లాకలెక్టరుగానున్న రూధర్ఫర్డు దండనీతిని అవలంబించాడు. పల్నాడులో కాల్పులుజరిగినవి దానిలో కొందరు ఆంధ్రయువకులు ప్రాణములను కోలుపోయిరి.

మన ఆంధ్రదేశములో యీలా వుండగా చౌరీచౌరాలో జరిగిన అమానుష కృత్యములకు గుండె చెదిరి గాంధీ ఉద్యమం విరమించాడు. ఆ సందర్భంలో గాంధీని అరెస్టుచేసి 6 సంవత్సరములు శిక్ష విధించారు. ఆవిషయములను స్వయముగా చూచివచ్చిన ప్రకాశం ఆంధ్రదేశమున ఆబాలగోపాలమునకు బోధించాడు. పిరికితనమనేదిఅయనకు తెలియుగు.

1923-26-ల మధ్యకాలంలో కొన్నిలు ప్రవేశములనుగూర్చి వాదోపవాదములు జరిగినవి కాంగ్రెసులో. మొదట అతనికి ఇష్టములేకపోయినా అందరు ఏదారిత్రొక్కితే ఆదారిని తను అవలంబించి బాగుచేయుటే అతనివిధిగా నెంచేవాడు. కాగా ప్రజలలో ప్రబోధము కలిగించి ఈ యింగ్లీషు సామ్రాజ్యతత్వము ప్రతిఘటించుటకు సంసిద్ధులుగా చేసేవాడు.

అతడు 144-వ శెక్షను ఉల్లంఘించినా ప్రభుత్వం చూడనట్టు వూరుకునేది, ఎందుచేతనో!

1926-వ ఎన్నికలు. ఆసమయంలో ప్రకాశం ఆంధ్రరాష్ట్రసంఘాధ్యక్షుడు కాగాశక్తివంచనలేక నిద్రా ఆహారాలు విసర్జించి రాత్రింబవళ్లు కారులోనే కాపరంపెట్టి బ్రహ్మాండ ప్రచారం సాగించాడు. తుదకు విజయవంతుడైనాడు. తనను గూర్చికాని తనకు ఓటుయిమ్మనిగాని ఎన్నడు అడిగి ఎరుగడు. అప్పుడు అతనికి ఎదురునిలిచిన మోచర్ల రామచంద్రారావుని 11 వేల వోట్ల మెజారిటీతో జయించాడు.

ఆ విజయసందర్భములో ఢిల్లీలోని హిందుస్థాన్ టైమ్సుపత్రికలో 'వెరిటన్స్' అనే విలేఖరి ఇట్లా ప్రశంసించాడు. 'హిందూదేశం మొత్తంమీద యీలాంటి విజయంలేదు. ప్రకాశం ఆంధ్రదేశానికి కిరీటంలేని రాజు.'

ఢిల్లీ శాసనసభలో సభ్యుడుగానున్నప్పుడు అతని ప్రధానకర్తవ్యం లైబ్రరీలో గ్రంథపఠనతో కాలక్షేపంచేయుటే. ఆరోజులలో ప్రకటితమైన కృష్ణా గోదావరి రీసెటిల్‌మెంటు రిపోర్టుపై తీవ్రముగా విమర్శలు వ్రాసాడు.

1928-లో మదరాసు సైమన్‌కమీషన్ వచ్చింది. దానిని బహిష్కరించడానికి ఆంధ్రా కాంగ్రెసు అధ్యక్షుడు ప్రకాశం సన్నాహంచేశాడు.

ఆ సందర్భంలో ప్రభుత్వసైనికులు తుపాకులు కాల్చినారు. ఆ భీభత్సంలో ఒకవీరుడు మృతుడైనాడు. ఆశవమును ప్రజలు చూపమనిరి. ప్రభుత్వము నిరాకరించింది. చూడటానికి వచ్చినవారిని కాల్చేస్తామన్నది.

ప్రకాశం చూడడానికి వెళ్ళాడు. ప్రభుత్వసైనికులు నిరోధించారు. ఇదుగో ప్రకాశంగుండె." కాల్చుకోమన్నాడు. లేదా శవాన్ని చూడనీయమన్నాడు. ప్రభుత్వసైనికులు ప్రకాశంపేరువిని దారిఇచ్చారు. ప్రకాశంగుండెధైర్యంఅట్టిది.

ఉప్పుసత్యాగ్రహశంఖానాదము పూరించాడు మహాత్ముడు. ఇంట పుత్రులు రోగగ్రస్తులైవున్నా, ఎన్ని చిక్కులున్నా సర్వమును త్యజించి ధైర్యముతో మదరాసులో మరొకసారి ఆంధ్రతేజమును ప్రదర్శించాడు. ఉప్పుశాసనము ధిక్కరించాడు. కాగా అతనికి ఒకసంవత్సరము కఠినశిక్ష పడింది.

ఆ జైలుజీవితంలోనే హిందీ, మళయాళం, అరవం విద్యార్థివలె దీక్షతో నేర్చుకున్నాడు.

1932-వ గాంధీ యిర్విన్ ఒడంబడిక ప్రకారం అతడు శిక్షాకాలమునకు ముందుగానే విడుదలబడి స్వరాజ్య తిరిగి ప్రచురించాడు. కాని ఆసంవత్సరమే అది ప్రెస్ ఆర్డినెన్సు కింద నిషేధింపబడింది. అతనికి ప్రియతమములోకెల్ల ప్రియతమమైనది స్వరాజ్యపత్రికే. దాని నేటిస్థితి తలుచుకుంటే అతనిహృదయం బీటలువారుతుంది.

కొంతకాలం మౌనంతాల్చాడు. తిరిగి 1937-లో ఎన్నికలకు తీవ్రప్రచారము సాగించాడు. విజయం సముపార్జించాడు.

అతడు నేడు ఆంధ్రరైతులకు కల్పతరువైనాడు. జమీందారులచే పీడింపబడు రైతులను సంరక్షింప బద్ధకంకణుడై వారిస్థితులు పరిశీలించి చిత్తుచట్టము తయారుచేసినాడు. ఆ చిత్తుచట్టమును ఛేదింప రాజాజీ పన్నాగములు చేయుచున్నట్లు తెలియుచున్నది.

ప్రకాశం మితభాషి. నిండైనవిగ్రహం. గంభీరముఖము. తీక్షణమైన ఆ కళ్ళు, ఆ పెదవుల తీరు అతని లోతు హృదయమును ప్రకటించును.

నిరాడంబరజీవి. మంత్రి అయినా అతని పాతశాలువ, తెల్లకేన్‌వాసు జోడు అతనితోనే వున్నవి.

ఎంత మితభాషియో అంత మితభుక్కు. విందుభోజనములకుగాని, విలాసముగా తిరుగుటగాని అతనికి హితవులుగావు. ఎంతసేపు ప్రజాసేవాపరాయణత.

అతని స్వతంత్రభావములకు గాంధీ కూడా కంటగించుకుంటాడు. అతడు దక్షిణదేశమున నాయకుడైతే గుజరాతీనాయకుల హక్కులు చెల్లవనే అరవనాయకుని అడ్డుపెట్టి చక్కాపోయాడు గాంధీ.

ఇట్లు ఆంధ్రనాయకులలో అగ్రగణ్యుడై ఆదర్శప్రాయుడైనవాడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం. ఆంధ్రుల భావిభాగ్యపు ప్రభాతకిరణము.

బాల్యము

గీ. మోవిపై జిందు చిఱునవ్వు - ముద్దుగొలుపు
జూచు కేల్దోయి పారవ - శ్యతను సలుపు
పాలబుగ్గలు పుణుకసం - భ్రమముగ్రిమ్ము
నద్దిరా! బాల్యమెంతప్రే - మాస్పదమ్ము.

గీ. ఎంతచూచిన విసువుద - యింపబోని
వనితలంతును రెంటిసీ - యవనియందుఁ
నాపరాత్పరు ప్రకృతిస్వ - రూపమొకటి
పసినిసువకారణతనొందు - ప్రమదమొకటి.

గీ. హాయటంచును విస్మయం - బూనినన్ను
మివుల బరికించుచుంటివే - మిటికినరుడ
అందదుకులేని సంతోస - మగ్గలింప
జిఱుతకాల్సేతులన్నాచి - చిబుకమదుర
శ్రావ్యనిస్వనముప్పతి - లంగనగవు
యబ్బుడుతగాంచి నామాట - కలరినావె.

ఆ. కాలిత్రేలుఁగోన - గలయమృతముగ్రోలు
చుంటినని తలంచు - చుంటికాని
బిడ్డ! పాలనురుగు - వెలికేగుచుంటనీ
మదినెఱుంగవే య - మాయికముగ.

సీ. కనరాదు నీప్రక్క - గామితార్థదము చిం
తామణీ నామదే - హా మలమణి
కనరాదు నీకరం - బున నజరామర
ణానందకరమగు - నమృతకణము
కనరారు నీచెంగ - టను సుందరాంగు లా
శ్వినులు మహితదేవ - వెజ్జులేని
వినరాదు నీచేరు - వను దెలిగంట్లు వి
పంచికమీాటి వా - యించుపాట.

గీ. హైన నెందులకో దెలి - యంగరాదు
యిట్లు చిఱుచేతులూచుట - లిట్టులూట
లూరుటయు నాత్రముగజూచు - చుంట మరియు
జెవులుటిక్కించి కిలకిల - ల్నేయుటప్ప.

సీ. కన్నులవిస్ఫులిం - గములు ఖ్లభయదహుం
కారముల్సేయు వ్యా - ఘ్రములులేవు
క్రకచదంష్ట్రోగ్ర భా - గములజీల్చి విషమ్ము
నుమియుచుండు మహోర - గములులేవు
తెగగాల్చునంట లో - త్తుగజిమ్మి బూతిగా
మండించు వీతిహో - త్రుండులేడు
ధణధణ ధ్వనుల ది - క్తటులల్లలాడించి
గుండెలగుల్చు పి - డ్గు జడిలేదు.

ఆ. కాని చిన్నిబొజ్జ - కంపింప నూర్పుగా
డ్పులకుగెంపుమోవి - పొలుపు తఱుగ
చెమటబిందువులు వి - శేషించి కార, వె
క్కెడ్చుచుంటివిట్టు - లేలబిడ్డ.

గీ. తుణముపూర్వమునీకు గ - ల్గిన సుఖంబు
నింతలో నూదయించు దు - రంతచింత
యెద్దియోవిన సంభ్రమం - బెదజనించె
నద్దినా కొగిదెల్పవే - వానిసుంగ

గీ. నీకు నవ్వుదయించిన - నాకునవ్వు
నీవుయేడ్చిన వెనువెంట - నేడ్వదలతు
నిట్టు లాకర్షణం బొన - రించువాడ
వీవా! కాకున్న నీయమా - యికమొ యెఱుగ.

—వలివేటి కామేశ్వర రావు.

Printed at the Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.